
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
సోమవారం, 4 ఆగస్టు 2025
5

సమాచార హక్కు చట్టం
పకడ్బందీగా అమలు చేయాలి

- ప్రభుత్వ ఆస్పత్రుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి
- విధిగా సిటిజన్ చార్టు అమలుచేయాలి
- ఆర్‌టీఐ కమిషనర్ పీవీ శ్రీనివాసరావు

వివరాలు : 6లో

ఒక్క నీటి చుక్కను
వదులుకోబోం

- బనకచర్ల పాపం ముమ్మాటికీ బీఆర్ఎస్‌దే..
- రాజకీయాల కంటే రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం : డిప్యూటీ సీఎం భట్టి


కమలాపురంలో గోదాము నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న భట్టి

ముదిగొండ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణకు న్యాయంగా దక్కాల్సిన సాగునీటి వాటాలో ఒక చుక్క నీటిని కూడా వదులుకోబోమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఆదివారం ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం కమలాపురంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఆధ్వర్యంలో రూ.10కోట్లతో నిర్మించతలపెట్టిన పదివేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోదాముల నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. అనంతరం రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. గత పదేళ్లలో బీఆర్ఎస్ సాగునీటి రంగానికి చేసిందని శూన్యమన్నారు. కృష్ణా, గోదావరి నదులపై గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించిన ప్రాజెక్టులే మన పంట పొలాలకు నీరందిస్తున్నాయన్నారు. రూ.లక్ష కోట్లు వెచ్చించి బీఆర్ఎస్ నిర్మించిన ఏకైక ప్రాజెక్టు కాళేశ్వరం అని.. అది కూడా ఒక ఎకరాకు నీరందించకుండా ఎండిపోయిందని విమర్శించారు. తమకు రాజకీయాల కంటే రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమన్నారు. పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ మన పంట పొలాలు ఎండిపోయేలా అక్రమ ప్రాజెక్టుల నిర్మాణానికి శ్రీకారం చుడుతుందన్నారు. అందులో బనకచర్ల ప్రాజెక్టు పాపం బీఆర్ఎస్‌దేనని దుయ్యబట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఢిల్లీకివెళ్లి సమర్థవంతంగా వాదనలు వినిపించడం వల్లే బనకచర్ల ప్రాజెక్టుకు బ్రేక్ పడిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన తప్పులను ఒక్కొక్కటిగా సరిదిద్దుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దుతున్నట్టు తెలిపారు. రాయలసీమ (మిగతా 6వ పేజీలో)

దర్జాగా కబ్జా!

- రూ.కోటి విలువైన ప్రభుత్వ భూమి ఆక్రమణ
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు

వివరాలు 7లో


గ్రానైట్ ఫ్యాక్టరీ

గ్రానైట్‌పై
రాయల్టీ భారం

చార్జీలను భారీగా పెంచిన రాష్ట్ర ప్రభుత్వం

- సమాచారం లేకుండానే పెంపు
- పరిశ్రమపై తీవ్ర ప్రభావం
- ఆందోళనలో గ్రానైట్ క్వారీల యజమానులు

ఖమ్మం ఖానాపురం హవేలి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఇప్పటికే తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న గ్రానైట్ పరిశ్రమలపై రాష్ట్ర ప్రభుత్వం మరో భారం మోపింది. రాయల్టీ పెంచడం వల్ల పరిశ్రమలు సంక్షోభంలో కూరుకుపోయాయి. గడిచిన కొన్ని సంవత్సరాలుగా పన్నులు, రాయల్టీ రేట్లు పెరగడంతో పాటు విద్యుత్ చార్జీలు, రవాణా ఖర్చులు కూడా భారీగా పెరిగాయి. దీంతో గ్రానైట్ క్వారీ యజమానులు, పరిశ్రమల యజమానులు తీవ్ర నష్టాలను చవి చూస్తున్నారు. గ్రానైట్ పరిశ్రమలో ఎన్నో సమస్యలు ఉన్నాయి, పన్నుల భారం, మైనింగ్ రాయల్టీ, అమ్మకపు పన్నుల వంటి అధిక పన్నులు పరిశ్రమకు గుదిబండగా మారాయి. క్వారీ లీజులను పునరుద్ధరించడంలో జాప్యంతో పాటు, పెనాల్టీలు, విజిలెన్స్ తనిఖీల సమయంలో అశాస్త్రీయ కొలతలతో భారీ జరిమానాలు విధించడం వంటి కారణాలతో పరిశ్రమ మనుగడకు ఇబ్బందులు తప్పడం లేదు. అంతర్జాతీయ పరిస్థితుల కారణంగా గ్రానైట్ ఎగుమతులు తగ్గడం వల్ల నష్టాలు చవిచూడాల్సి వస్తోందని పలువురు పరిశ్రమ, క్వారీ యజమానులు వాపోతున్నారు. అసలే కష్టాలలో ఉన్న గ్రానైట్ పరిశ్రమలను ఆదుకోవాల్సిన ప్రభుత్వం.. తాజాగా ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండానే రాయల్టీలు పెంచడంతో పరిశ్రమ మనుగడకు ఇబ్బందులు తప్పవని ఆందోళన చెందుతున్నారు.

రాయల్టీ పెంపుదల, ఇతర భారాలు

తెలంగాణలో గత మూడేళ్లలో గ్రానైట్ పన్నులు 115 శాతం మేర పెరిగాయి. ఒక క్యూబిక్ మీటర్ గ్రానైట్ రాయిపై రాయల్టీ రూ.2,300 నుంచి రూ.2,990కి పెరిగింది. దీనికి అదనంగా, "పర్మిట్ సి" పేరుతో 40 శాతం పన్ను పెంచడంతో.. ఒక్కో క్యూబిక్ మీటర్‌పై రూ.1,200 అదనపు భారం పడుతోంది. ఈ పెంపుతో పాటు క్వారీలపై విజిలెన్స్ దాడులు, భారీ జరిమానాలు, పర్యావరణ అనుమతులకు అయ్యే ఖర్చులు కూడా విపరీతంగా పెరిగాయి.

పెరిగిన ధరలు

బ్లాక్ గ్రానైట్‌కు గతంలో క్యూబిక్ మీటర్ గ్యాంగ్‌సాకు మీటర్‌కు రూ. 3900లు ఉండగా.. ప్రస్తుతం పెంచిన ఫీజు రూ. 4680, బిలో గ్యాంగ్‌సాకు గతంలో రూ. 2990 ఉండగా ప్రస్తుతం రూ. 3588, కలర్ గ్రానైట్‌కు గతంలో గ్యాంగ్‌సాకు రూ. 2990 ఉండగా.. ప్రస్తుతం రూ. 3588, బిలో గ్యాంగ్ గతంలో రూ. 2600లు ఉండగా.. ప్రస్తుతం రూ. 3120 కు పెంచారు. గ్రావెల్‌పై గతంలో కంకర టన్నుకు రూ. 65 ఉండగా.. ప్రస్తుతం రూ. 78, గ్రావెల్ టన్నుకు గతంలో రూ.20 ఉండగా.. ప్రస్తుతం రూ.78, కోరండం గతంలో రూ. 78 ఉండగా.. ప్రస్తుతం రూ.94, డోలో మైట్ గతంలో రూ.130 ఉండగా.. ప్రస్తుతం రూ. 156కు పెంచారు. ఎలాంటి ముందస్తు ఆదేశాలు లేకుండా ఫీజులు పెంచటంతో గ్రానైట్ పరిశ్రమలు, క్వారీ పరిశ్రమల యజమానులు ఆందోళన చెందుతున్నారు. అసలే గ్రానైట్ పరిశ్రమ పరిస్థితి బాగలేక మూతపడుతున్న సమయంలో ప్రభుత్వం ఫీజులు పెంచడం సరైంది కాదని, వెంటనే పెంచిన ఫీజులను తగ్గించాలని యజమానులు కోరుతున్నారు.

పరిశ్రమపై తీవ్ర ప్రభావం

పెరిగిన ఖర్చుల వల్ల గ్రానైట్ పరిశ్రమలో ఉత్పత్తి ఖర్చు విపరీతంగా పెరిగింది. అయితే, అంతర్జాతీయ మార్కెట్లో, ముఖ్యంగా చైనా వంటి దేశాల నుంచి డిమాండ్ తగ్గుముఖం పట్టడం, దేశీయంగా రాజస్థాన్ వంటి రాష్ట్రాల నుంచి తక్కువ ధరలకే గ్రానైట్ లభించడం వల్ల గ్రానైట్ ధరలు పడిపోయాయి. దీంతో పరిశ్రమ యజమానులకు లాభాలు తగ్గి నష్టాలు పెరుగుతున్నాయి. గ్రానైట్ ఉత్పత్తి కేంద్రాల్లో అనేక ఫ్యాక్టరీలు మూతపడ్డాయి. వేలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోయి స్వస్థలాలకు వలస వెళ్తున్నారు.

గ్రానైట్ పరిశ్రమల యజమానుల సంఘాలు ఈ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాలను కోరుతున్నాయి. తెలంగాణలో గతంలో ఉన్న స్లాబ్ విధానాన్ని తిరిగి తీసుకురావాలని, విద్యుత్ రాయితీలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే ఈ పరిశ్రమ పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తెలంగాణ ప్రభుత్వం గ్రానైట్ పరిశ్రమపై రాయల్టీ ఛార్జీలను భారీగా పెంచింది, ఇది పరిశ్రమకు సంక్షోభాన్ని సృష్టిస్తోంది. గతంలో ఒక క్యూబిక్ మీటర్ గ్రానైట్ రాయిపై రూ. 2,300 ఉన్న రాయల్టీని రూ. 2,990కి పెంచారు. దీంతోపాటు పర్మిట్ ఫీజు పేరుతో అదనంగా 80శాతం పన్ను విధించారు. ఈ పెంపుదల కారణంగా గ్రానైట్ ముడి సరుకు ధరలు పెరిగి, పరిశ్రమలు నష్టాలు ఎదుర్కొంటున్నాయి. ఖమ్మం, కరీంనగర్ వంటి జిల్లాల్లోని చాలా గ్రానైట్ ఫ్యాక్టరీలు ఇప్పటికే మూతపడ్డాయి. దీనివల్ల వేలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోతున్నారు.


కొత్తగూడెం బస్టాండ్

అభివృద్ధికి నిధులు!


- మరమ్మతుల కోసం సీఎస్ఆర్ నిధులు రూ.28 కోట్లు?
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం ఆర్టీసీ బస్టాండ్ అభివృద్ధికి ప్రతిపాదనలు వేగం పుంజుకున్నాయి. ఇటీవల 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో ప్రచురితమైన 'సమస్యల ప్రాంగణం' అనే కథనానికి అధికార యంత్రాంగం స్పందించింది. దిన దినాభివృద్ధి చెందుతున్న కొత్తగూడేనికి నూతన బస్టాండ్ నిర్మించాలని 2024లోనే రాష్ట్ర ప్రభుత్వానికి స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రతిపాదనలను సిద్ధం చేసి పంపించారు. ఈ క్రమంలో భద్రాద్రి జిల్లా పర్యటనకు విచ్చేసిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాకిటి శ్రీహరి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మంత్రి (మిగతా 6వ పేజీలో)

నాగార్జున సాగర్..
సాగునీటి దేవాలయం

- ఇంజనీర్ల కలకు ప్రతిరూపం
- ఖమ్మానికి సాగునీటి భాగ్యం
- జిల్లా దశను మార్చిన ఎన్నెస్పీ జలాలు
- సాగర్ నీటి విడుదలకు నేటితో 58 ఏళ్లు



ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : 22లక్షల ఎకరాలకు సాగునీరు.. లక్షలాది గ్రామాలకు తాగునీటిని అందిస్తున్న ఆధునిక దేవాలయం నాగార్జున సాగర్.. భారతదేశ భాండాగారం.. అన్నదాతల ఆత్మబంధువు.. ఇలా ఎవరు, ఏ పేరుతో పిలుచుకున్నా.. దాని పరిధిలో నివసిస్తున్న వారి జీవితాల్లో వెలుగులు నింపుతోంది నాగార్జున సాగర్. సాగర్ పరిధిలోని ఎడమ కాలువ కింద ఖమ్మం, నల్గొండ, కృష్ణా జిల్లాల్లోని సుమారు 11లక్షల ఎకరాలకు సాగునీటిని అందిస్తుండగా.. బహుశా కుడికాలువ పరిధిలో 203కిలోమీటర్ల పరిధిలో కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో 15లక్షలకు పైగా ఎకరాల్లో సాగు నీరందిస్తూ బహుళార్థక సాధక ప్రాజెక్టుగా అలరారుతోంది. ఆదివారం నాటికి ఈ ప్రాజెక్టు ప్రారంభమై 58 ఏళ్లు కావస్తుంది.

తెలుగు రాష్ట్రాల అన్నపూర్ణ.. వేలాది మంది కార్మికుల శ్రమఫలితం.. ఆధునిక దేవాలయంగా ప్రసిద్ధి చెందిన నాగార్జున సాగర్ ప్రాజెక్టు ప్రారంభమై 58ఏళ్లు కావస్తోంది. గలగల పారే కృష్ణవేణి నదీ ప్రవాహాన్ని సద్వినియోగం చేసుకోవాలనే తలంపుతో 1955, డిసెంబర్ 10న అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ఈ ప్రాజెక్టు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. క్రీ.శ 2వ శతాబ్దంలో నందికొండ లోయ ప్రాంతాన్ని రాజధానిగా పాలించిన ఆచార్య నాగార్జునుడి పేరును ఈ ప్రాజెక్టుకు పెట్టారు. సాగర్ పనులు 1956 (మిగతా 6వ పేజీలో)

ఆనకట్ట ప్రత్యేకతలు ఇవీ :

- నాగార్జున సాగర్ ఆనకట్ట స్థూల సామర్థ్యం 408.24 టీఎంసీలు
- జీవ సామర్థ్యం 202.24 టీఎంసీలు
- జలాశయం పూర్తి నిల్వ స్థాయి (ఎఫ్ఆర్ఎల్) 590 అడుగులు
- జలాశయం కనిష్ఠ నిల్వ స్థాయి 510 అడుగులు
- ఎడమ కాలువ విస్తీర్ణం 295 కిమీ
- కుడి కాలువ విస్తీర్ణం 203 కిమీ
- ఆనకట్ట అడుగుభాగం 287.9అడుగుల నుంచి 327 అడుగుల వెడల్పు ఉంది.
- 4,756 అడుగుల మ్యాసనరీ డ్యాంను 79 బ్లాకులుగా నిర్మించారు. ఈ నిడివిలో ఎడమవైపు నాన్ ఓవర్‌ఫ్లో సెక్షన్ 1394 అడుగులు, కుడివైపున 1812 అడుగులు.. రెండువైపులా ఉన్న మొత్తం నాన్ ఓవర్‌ఫ్లో సెక్షన్ల మధ్య 24వ బ్లాకు నుంచి 50వ బ్లాకు వరకు ఓవర్‌ఫ్లో సెక్షన్ నిడివి 1550 అడుగులుగా ఉంది.
- 44 అడుగుల సైజుతో 26 రేడియల్ క్రస్టు గేట్లను జలాశయం మట్టం 546 అడుగుల స్థాయి పై అమర్చారు.
- కృష్ణానదికి భారీగా వరదనీరు వచ్చినప్పుడు ఈ గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేస్తారు.
- 11.70లక్షల క్యూసెక్కుల వరద నీటిని స్పిల్ మీదుగా విడుదలకు వీలుంటుంది.
- స్పిల్‌వే 546 అడుగుల స్థాయి నుంచి దిగువన 240 అడుగుల స్థాయిలో ఉన్న బకెట్ పోర్షన్ లోకి పడిన నీరు స్కైజంప్ అవుతుంది.

కోయభాష లిపితో ఆదివాసీ దినోత్సవ
ఆహ్వాన పత్రికల పంపిణీ

- రాష్ట్ర మంత్రులు, కమిషనర్లు, శాసనసభ్యులకు అందజేత

భద్రాచలం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఈనెల 9న జరిగే ప్రపంచ ఆదివాసీ దినోత్సవ ఆహ్వాన పత్రికలను కోయభాష లిపితో ఆహ్వాన పత్రికలను ముద్రించి రాష్ట్ర మంత్రులు, కమిషనర్లు, ప్రజాప్రతినిధులకు పంపిణీ చేయడం జరిగిందని భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ పేర్కొన్నారు. గిరిజనుల భాష సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు అంతరించిపోకుండా బాషా సంస్కృతిని నేటి యువత అవగాహన కల్పించుకునే ఉద్దేశ్యంతోనే కోయబాషను గుర్తించడంతో పాటు కోయభాషలోనే ముద్రించి గిరిజనులు వారి భాషను ప్రాచుర్యంలోకి తీసుకొని రావడానికి కృషి చేస్తున్నామని పీవో వివరించారు.


కోయభాషలో ముద్రించిన ఆహ్వాన పత్రిక




మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం

పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులు
అమానవీయం

- 7న జరిగే సంఘీభావ ర్యాలీకి సీపీఎం మద్దతు
- కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం

7

చెరువులో పడి
ముగ్గురి గల్లంతు


మృతి చెందిన జగన్ (ఫైల్)

- నాగులవంచలో వేర్వేరు ఘటనలు
- ఒకరి మృతదేహం లభ్యం
- మరో ఇద్దరి కోసం గాలింపు
- గల్లంతైన వారిద్దరు అన్నదమ్ములు

చింతకాని, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు ఘటనల్లో చెరువులో పడి ముగ్గురు గల్లంతు కాగా.. ఒకరి మృతదేహం లభ్యమైన ఘటన ఖమ్మం జిల్లా చింతకాని మండలం నాగులవంచ గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. నాగులవంచ గ్రామానికి చెందిన రైతు తోటకూరి జగన్ (33) వ్యవసాయం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. రోజూలాగే ఆదివారం కూడా జగన్ తన గేదెలను మేపేందుకు పొలంలోకి తీసుకెళ్లాడు. మధ్యాహ్నం నీళ్ల తాగేందుకు చెరువులోకి వెళ్లిన గేదెలు ఎంతకూ బయటకు రాకపోవడంతో.. వాటిని బయటకు తీసుకొచ్చేందుకు జగన్ చెరువులోకి దిగాడు. అయితే నీటి లోతు తెలియక పోవడం.. ఈత రాకపోవడంతో జగన్ చెరువులో మునిగి మృతిచెందాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా.. జగన్‌కు భార్య, ఇద్దరు పిల్లలు. మృతుడి భార్య స్వాతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ నాగుల్‌మీరా కేసు దర్యాప్తు చేస్తున్నారు. అలాగే నాగులవంచ గ్రామానికే చెందిన (మిగతా 6వ పేజీలో)

'విజయ డెయిరీ'
దశ మారుతోంది..!



- 1972లో పాలశీతల కేంద్రం ఏర్పాటు
- 53 ఏళ్ల తర్వాత ఆధునిక యంత్రాలు
- 10వేల లీటర్ల సామర్థ్యం నుంచి 25వేల లీటర్లకు పెంపు
- నాబార్డు నుంచి రూ.2.35 కోట్ల నిధులు మంజూరు చేయించిన మంత్రి తుమ్మల

ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఖమ్మంలో నిర్వహణ జరుగుతున్న విజయ డెయిరీ మరో మైలురాయిని చేరుకోబోతుంది. 53ఏళ్ల తర్వాత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో మరింత మెరుగ్గా కార్పొరేట్ సంస్థల పాల డెయిరీలకు ధీటుగా రూపుదిద్దుకోబోతుంది. ఇందుకోసం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నాబార్డు నుంచి ప్రత్యేకంగా రుణాలను మంజూరు చేయించారు. దీంతో రూ.2కోట్లతో డెయిరీ ఆధునికీకరణ దిశగా అడుగులు పడుతున్నాయి.

ఉమ్మడి జిల్లాకు ఖమ్మం నుంచి పాల సరఫరా

1972లో ఖమ్మంలోని రోటరీనగర్‌లో విశాలమైన ప్రాంతంలో విజయ ప్రభుత్వ డెయిరీ నిర్మాణం చేపట్టారు. ఆనాటి నుంచి చిన్న చిన్న మార్పులతో పాలశీతల కేంద్రం కొనసాగుతోంది. ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా 160 కేంద్రాల ద్వారా పాలు, పాల ఉత్పత్తుల అమ్మకాలు కొనసాగిస్తోంది. కామేపల్లి, ఇల్లెందు, కొత్తగూడెం, సత్తుపల్లి, కల్లూరు, ఎర్రుపాలెంలో పాల శీతల కేంద్రాల స్థానిక యూనిట్ల ద్వారా పాలు, పాల ఉత్పత్తులను నిల్వ చేసి వాటిని తిరిగి అమ్మకాలు జరుపుతున్నారు. ఇల్లెందు మినహా మిగితా ప్రాంతాల్లో పాల సేకరణ భారీగానే ఉంటుంది. సీజన్‌లో మాత్రం 20వేల లీటర్ల వరకు విజయ డెయిరీ ద్వారా పాల సేకరణ జరుగుతుంది.

10 వేల నుంచి 25 వేల లీటర్లకు..

ఖమ్మం కేంద్రంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాకు పాలు, పాల ఉత్పత్తులను పంపిణీ చేసే (మిగతా 6వ పేజీలో)

ఎన్‌ఎస్‌సీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

ఏఐ ల్యాబ్ నిర్వహణలో రాష్ట్రస్థాయిలో ప్రథమం

బడిబాటలో కరపత్రాలతో ప్రచారం
అత్యధికంగా అడ్మిషన్లు
ఎన్‌ఎస్‌సీ పాఠశాలకు
విద్యాశాఖ అధికారుల అభినందనలు

ఖమ్మం ఖానాపురంహవేలి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల కుటుంబాల పిల్లల విద్యాభివృద్ధికి అనేక కార్యక్రమాలను ప్రవేశపెట్టింది. నాణ్యమైన భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంతో పాటు ప్రస్తుత కాలంలో అత్యంత అవసరమైన ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్) కృత్రిమ మేధాకి ప్రాముఖ్యతను పెంచుతూ విద్యార్థులకు విద్యను అందిస్తుంది. అతిక ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వ పాఠశా లల్లో ప్రేశపెట్టింది. అందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 5 జిల్లాలో జిల్లాకు 7 పాఠశాలలను ఎంపిక చేశారు. ఇందులో భాగంగా ఖమ్మం నగరంలోని ఎన్‌ఎస్‌సీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఎంపిక చేశారు. పాఠశాల ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణను అందించారు. పాఠశాలలో ఏఐ విద్యకు కావాల్సిన ల్యాబ్, కంప్యూటర్లుకు రూ.18 లక్షలు మంజూరు చేసి ఆధునిక పరికరాలను అందించారు. 2024-25 విద్యా సంవత్సరంలో పాఠశాలలో 277 మంది విద్యార్థులు ఉండగా 2025-26 విద్యా సంవత్సరంలో 362కు చేరింది. దీనికి కారణం పాఠశాలలో ఏఐ విద్యను అందించడం. దీంతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు వేసవి సెలవులలో, బడిబాట కార్యక్రమంలో పాఠశాలలో అందిస్తున్న ఏఐ విద్యకు సంబంధించిన వివరాలతో కూడిన కరపత్రాలు ముద్రించి ఇంటింటికీ తిరగటంతో పాటు, అంగన్‌వాడీ కేంద్రాలలోని పిల్లల వివరాలు తీసుకోని వారిని పాఠశాలల్లో చేరే విదంగా తల్లిదండ్రులను ఒప్పించారు. ఖమ్మం నగరంలోనే అత్యధిక మంది విద్యార్థులున్న ప్రాథమిక పాఠశాలగా పేరుగాంచింది. మొదట ఇతర ప్రభుత్వ పాఠశాలల్లోని మూడు కంప్యూటర్లను తీసుకొచ్చి విద్యార్థులకు ఏఐ తరగతులు చెప్పటం మొదలు పెట్టారు. ఆ తరువాత ప్రభుత్వం నిధులు మంజూరు చేయటంతో మొత్తం 14 కంప్యూట్లతో ఏఐ విద్యను అందిస్తున్నారు. ల్యాబ్ నిర్వాహణలో పాఠశాల రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది. ప్రవేటు పాఠశాలల నుంచి 72 మంది విద్యార్థులు ఈ ఏడాది ఎన్‌ఎస్‌సీ పాఠశాలలో చేరడం విశేషం. జూన్ 24న జిల్లాకు వచ్చిన విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితారాణాతో పాటు రాష్ట్రస్థాయి విద్యాశాఖ అధికారుల బృందం పాఠశాలను సందర్శించి ఏఐ తరగతుల బోధన వివరాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. విద్యార్థులతో కంప్యూటర్‌లో ఏఐ తరగతులకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసు కున్నారు. పాఠశాలలోని తరగతి గదులను, మూత్రశాలలను పరిశీలించి ఏఐ ప్రోగ్రాంకు ఇంచార్జిగా ఉన్న పాఠశాల ఉపాధ్యాయుడు రాజేష్, 4వ తరగతి విద్యార్థులకు తెలుగు బోధిస్తున్న ఉపాధ్యాయురాలు ఉమాను ప్రధానోపాధ్యాయుడు వెంకన్నను, ఉపాధ్యాయులను విద్యార్థులను, అభినందించారు.



ఎన్‌ఎస్‌సీ పాఠశాల


ఏఐ తరగతులు నేర్చుకుంటున్న విద్యార్థులు

ఏఐ తరగతులతోనే అడ్మిషన్లు పెరిగాయి

బి. వెంకన్న, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు,



నగరంలోని ఎన్‌ఎస్‌సీ ప్రభుత్వ పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరంలో అత్యధింకంగా 90 నూతన అడ్మిషన్లు పెరిగాయి. గత ఏడాది 277 మంది విద్యార్థులు ఉంటే ప్రస్తుతం 362 మంది విద్యార్థులు ఉన్నారు. కారణం వేసవి సెవులలో, బడిబాటలో ప్రత్యేకంగా కరపత్రాలతో ప్రచారం నిర్వహించాం. ఏఐ తరగతుల గురించి విద్యార్థుల తల్లితండ్రులకు వివరించాం. ఏఐ తరగతులకు సంభందించి ప్రత్యేకంగా ఓ గదిని ఏర్పాటు చేసి 14 కంప్యూటర్లతో తరగతులు నిర్వహిస్తున్నాం. ఏఐ ల్యాబ్ నిర్వాహణలో పాఠశాల రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో నిలిచింది. అందుకు ఉపాధ్యాయులకు, విద్యార్థులకు వారి తల్లితండ్రులకు ప్రత్యేకంగా కృతజ్ఞతులు.

మా కష్టం ఫలించింది

సీహెచ్. రాజేష్, ఏఐ తరగతుల ఇన్‌చార్జ్



వేసవి సెలవులలో, బడిబాట కార్యక్రమంలో మా ప్రధానోపాధ్యాయుడు ఆదేశాలతో మా పాఠశాల పరిధిలోని ప్రతి ఇంటిని సందర్శించి పాఠశాలలో అందిస్తున్న ప్రత్యేక తరగతుల వివరాలను వివరించాం. దీంతో మేము ఎంతో కష్టపడ్డందుకు ఫలితం వచ్చింది. ఏఐ తరగతుల కారణంగా విద్యారుల సంఖ్య గణనీయంగా పెరిగింది. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలకు అందించిన కంప్యూటర్లతో విద్యార్థులకు ఏఐ తరగతులు నిర్వహిస్తున్నాం. జిల్లాలోను, రాష్ట్రంలోను పాటశాలకు ప్రత్యేక గుర్తింపు తేగలిగాం.

సమాచార హక్కు చట్టం పకడ్బందీగా అమలుచేయాలి

ప్రభుత్వ ఆస్పత్రుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి
విధిగా సిటిజన్ చార్టు అమలుచేయాలి
ఆర్‌టీఐ కమిషనర్ పీవీ శ్రీనివాసరావు


తిరుమలాయపాలెం ప్రభుత్వాస్పత్రి వైద్యులతో మాట్లాడుతున్న ఆర్‌టీఐ కమిషనర్ పీవీ శ్రీనివాసరావు

తిరుమలాయపాలెం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): సమాచారశాఖ హక్కు చట్టం పకడ్బందీగా అమలుచేయాలని, ప్రభుత్వ ఆస్పత్రులను అభివృద్ధి చేయడంతో పాటు నాణ్యమైన వైద్య సేవలు అందించ డానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందని రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్ పీవీ శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం తిరుమలాయపాలెంలోని కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ కృపా ఉషశ్రీ, డిప్యూటీ డీఎంహెచ్‌వో చందునాయక్, డాక్టర్ బొల్లికొండ శ్రీనివాసరావుతో కలిసి సిబ్బందితో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రిలో విధిగా ప్రజలకు రోగనిర్ధారణ పరీక్షలు జరపాలని, ఎక్కడికక్కడ వైద్యసేవలు అందించి సంపూర్ణ ఆరోగ్యంతో ఇంటికి వెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ప్రభుత్వ ఆస్పత్రుల్లో సహజ ప్రసవాలు పెంచి ప్రభుత్వ నిర్దిష్ట లక్ష్యాలను నెరవేర్చాలని సూచించారు. అలాగే సీజన్‌లో వచ్చే డెంగీ, మలేరియా, విషజ్వరాలు, వ్యాధులు ప్రబలకుండా నిర్దిష్ట చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే మండలంలోని తిప్పారెడ్డిగూడెం, చంద్రుతండాలో డెంగీ కేసులు నమోదు అవుతున్నాయని, ఆ గ్రామాల్లో ప్రత్యేక వైద్యశిబిరాలు నిర్వహంచాలన్నారు. రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆస్పత్రిలో సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టిపెట్టాలని, ఆస్పత్రిని అన్ని విధాల అభివృద్ధి చేయాలని అధికారులు ఆదేశించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో విధిగా సిటిజన్ చార్టు ఏర్పాటు చేయాలన్నారు. రెండేళ్లపాటు ఆర్టీఐ కమిషనర్ నియామకం జరగకపోవడంతో 17 వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని త్వరగా పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు అమర్‌సింగ్, టీఎన్‌జీవోస్ రాష్ట్ర నాయకులు జమ్మి జయపాల్, కమ్మకోమటి నాగేశ్వరరావు, దోమల రమేష్ పాల్గొన్నారు.

పోలీసుల విస్తృత తనిఖీలు

పినపాక, 3 ఆగస్టు (ఆంధ్రజ్యోతి) : గత నెల 28 నుంచి ఆగష్టు 3 వరకు మావోయిస్టు అమరవీరుల సంస్మరణ సభలు నిర్వహణకు వారోత్సవాలు జరిపేందుకు మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ పిలుపునిచ్చింది. దీంతో ఆదివారం చివరి రోజు కావడంతో మావోయిస్టులు ఏవైనాదాడులకు, దుశ్చర్యలకు పాల్పడవచ్చనే నేపథ్యంలో పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. ముఖ్యంగా గోదావరి సరిహద్దు బెల్ట్ గ్రామాలు గుంబనంగా ఉన్నాయి. ఈ ప్రాంతంలో ఛత్తీగడ్ నుంచి వచ్చి స్థిరపడ్డ వలస ఆదివాసీ గ్రామాల్లో మావోయిస్టుల తాలుకూ రాకపోకలు సాగుతుంటాయన్న పోలీస్ నిఘా వర్గాల హెచ్చరికల నేపథ్యంలో పోలీసులు మరింత అప్రమత్తమయ్యారు. ఆదివారం ఏడూళ్లబయ్యారం సీఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ సురేష్‌లు రెండు బృందాలుగా తమ సిబ్బందితో మణుగూరు, ఏటూరునాగారం ప్రధాన రహదారిపై దుగినేపల్లి, మల్లారం, జానంపేట, ఏడూళ్లబయ్యారం క్రాస్‌రోడ్‌లలో నాకాబందీ నిర్వహించారు.

గంజాయి స్వాధీనం

ఖమ్మం క్రైం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రంగనాయకుల గుట్టలో ఆదివారం తనిఖీలు చేపట్టి ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని ఖమ్మం మూడో పట్టణ పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మోహన్‌బాబు తెలిపారు. వారి నుంచి కిలో గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మరో వ్యక్తి పారిపోయాడన్నారు. స్థానికంగా ఆటో డ్రైవర్‌గా పనిచేసే బుర్రి మల్లిఖార్జున్‌రావు ఇతర ప్రాంతాల నుంచి గంజాయిని తెచ్చి విక్రయిస్తున్నాడన్నారు. దాడి సందర్భంగా అతను పరారీలో ఉన్నాడని, అతని వద్ద గంజాయి కొనుగోలుకు వచ్చిన స్థానికులు సంపత్, మదన్‌లను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

ఎండిపోతున్న పంట పొలాలు

'సాగర్' పంట కాల్వల తూములకు అందని సాగునీరు
వెయ్యి ఎకరాల ఆయకట్టు ప్రశ్నార్థకం
ఆందోళనలో రైతులు

కల్లూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): సాగర్ ఎడమకాల్వపై గల పంటకాల్వల తూములకు సాగునీరు అందక కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామాల్లో సాగుచేసిన వరిపైరు ఎండిపోతున్నది. ఈ ఏడాది సీజన్‌లో మండల పరిధిలోని పుల్లయ్యబంజరు, తూర్పులోకవరం, పడమట లోకవరం, కొత్తబోడిమల్లే గ్రామాల్లో సుమారు 600 నుంచి 1000 ఎకరాల్లో వరి పైరు సాగువుతుంది. సాగర్ ప్రధాన కాల్వ (ఎడమ)పై అనుసంధానంగా ఆయా గ్రామాలకు మూడు ప్రదేశాల్లో పంట కాల్వల ద్వారా సాగునీరు అందాల్సి ఉంది. కానీ ఈ పంట కాల్వల తూములకు సాగునీరు అందాలంటే సాగర్ కాల్వలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండాలి, దీనికి తోడు తూములకు నీరు అందించేలా పంట కాల్వ సమీపాన ఉన్న రెగ్యూలేటర్లను దించాలి. అప్పుడే పంట పొలాలకు సాగునీరు అందుతుంది. కాల్వల నిర్మాణ సమయంలో ఆయా గ్రామాల పంట కాల్వల ప్రదేశాల్లో లోతుగా నిర్మించారు. తూముల ఏత్తు పెంచారు. దీంతో ఆయా పంట కాల్వల తూములకు నీరు అందని పరిస్థితి ఏర్పడింది. ఈ సీజన్‌లో ఆయా గ్రామాల రైతుల విజ్ఞాపనలకు గాను స్పందించిన జలవనరుల శాఖ అధికారులు కేవలం రెండు రోజులు మాత్రమే సాగునీరు అరకొరగా అందించారు. ఇక గత వారం రోజుల నుంచి పగటి పూట విపరితంగా ఎండలు కాస్తున్నాయి. దీంతో భూమిలో తేమ శాతం తగ్గటంతో వరి పైరు వందల ఎకరాల్లో సాగునీటి ఎద్దడితో ఎండిపోయే దశకు చేరుకున్నది. సాగర్ ఎడమకాల్వపై పుల్లయ్యబంజర, లోకారం మేజర్ కాల్వలపై, పైవిధంగా తూములకు సాగునీరు అందక పంట పొలాలు ఎండిపోతున్నాయని బాధిత రైతులు బోబోలు లక్ష్మణరావు, పెద్దబోయిన నారాయణరావు, కాగిత రామారావులు తెలిపారు. ఇప్పటికైన తమ గ్రామాల పంట పొలాలకు సాగునీరు అందించేలా జలవనరులశాఖ అధికారలు తగిన చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.


పుల్లయ్యబంజరులో సాగర్ ఆయుకట్టు కింద ఎండిపోతున్న వరి పైరు

జాతీయ స్థాయి కథల పోటీల్లో పాపకొల్లు పాఠశాల విద్యార్థిని ప్రతిభ


విద్యార్థిని వర్షితను సత్కరిస్తున్న దృశ్యం

జూలూరుపాడు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : జాతీయస్థాయి లో నిర్వహించిన కథల పోటీల్లో జూలూరుపాడు మండలంలోని పాపకొల్లు ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థిని భూక్యా వర్షిత ప్రతిభను కనబర్చింది. సదరు విద్యార్థిని రాసిన జంక్ ఫుడ్‌తింటే అనే కథకు ద్వితీయ బహుమతి లభించింది. దీంతో ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్రభా రతిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేంద్ర బాలసాహిత్య అకాడమి అవార్డు గ్రహిత, నేషనల్ బుక్ ట్రస్ట్ ప్రాంతీయ అధికారి పత్తిపాక మోహన్ వర్షితను సత్కరించి మెమోంటో, నగదు బహుమతిని అందచేశారు. ఈ కథల పోటీల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన 541 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థిన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మీరా సాహెబ్, తెలుగు ఉపాధ్యాయురాలు పురిమళ్ల సునందన, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

ప్రజా సేవకుడు సున్నం రాజయ్య

» సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ సభ్యుడు రమేష్


రాజయ్య స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

భద్రాచలం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే సున్నం రాజయ్య స్ఫూర్తితో ప్రజా పోరాటాలు, వర్గ పోరాటాలు ముందుకు తీసుకుపోవడమే సున్నం రాజయ్యకు మనం ఇచ్చే ఘన నివాళి అని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ సభ్యుడు ఏజే రమేష్‌లు పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే సున్నం రాజయ్య 5వ వర్ధంతి సందర్భంగా పట్టణంలో పార్టీ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజయ్య స్థూపం వద్ద పార్టీ పతాకాన్ని సీనియర్ నాయకులు, మాజీ డీసీసీబీ చైర్మన్ యలమంచి రవి కుమార్ ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో నాయకులు ఏజే రమేష్, కారం పుల్లయ్య, ఎంబీ నర్సారెడ్డిలు మాట్లాడుతూ నియోజకవర్గంలో గిరిజన గ్రామాల అభివృద్ధి కోసం నిరంతరం పరితపించారని అన్నారు. ఏజెన్సీలో విద్య, వైద్య మౌలిక సదుపాయాల కోసం పోడు భూముల పట్టాల సాధన కోసం ఎనలేని కృషి చేసిన ఆదివాసీ ఆత్మ బంధువు సున్నం రాజయ్యని పేర్కొన్నారు. నేటి యువతకు సున్నం రాజయ్య జీవితం ఆదర్శప్రాయమని వివరించారు. ఈ సభలో యలమంచి రవికుమార్, పి.సంతోష్‌కుమార్, డి.సీతాలక్ష్మి, నాదెళ్ల లీలావతి, నకిరికంటి నాగరాజు, యు.జ్యోతి, కుంజ శ్రీనివాస్, జీవన జ్యోతి, బి.కుసుమ, ఎస్.అజయ్ కుమార్, కోరాడ శ్రీనివాస్, సంద్రా భూపేంద్ర, కొలగాని రమేష్ పాల్గొన్నారు.

నాగార్జున సాగర్!

సాగునీటి దేవాలయం..

(5వ పేజీ తరువాయి)

నుంచి ముమ్మరంగా చేపట్టారు. 1964 నాటికి రేడియల్ క్రాస్టు గేట్ల పనులను పూర్తిచేయగా.. 1967 ఆగస్టు 4న కుడి ఎడమ కాలువలకు అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ నీటిని విడుదల చేసి జాతికి అంకితం చేశారు. 1968 నాటికి ప్రాజెక్టు పనులను పూర్తి చేశారు. మొత్తం 22లక్షల ఎకరాలకు సాగునీటితో పాటు లక్షలాది గ్రామాలకు ఈ ప్రాజెక్టు తాగునీటిని అందిస్తోంది. ఈ ప్రాజెక్టు తెలుగు రాష్ట్రాలకు జల విద్యుత్ వెలుగులు కూడా ప్రసాదిస్తోంది. సాగర్ జలాశయం నీటితో కుడి కాలువ కింద గుంటూరు జిల్లాలో 11లక్షల ఎకరాలు, ఎడమ కాలువ కింద నల్గొండ ఖమ్మం, కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాల్లో మరో 11లక్షల ఎకరాల్లో సాగు తాగునీటిని అందిస్తూ బహుళార్థక ప్రాజెక్టుగా విరాజిల్లుతోంది. ఈ మానవ నిర్మాణ మహాద్భుత కట్టడానికి 45వేల మంది కార్మికులు 12ఏళ్ల పాటు నిరంతరం శ్రమించారు.

● బంజరు భూములన్నీ సస్యశ్యామలం!

నాగార్జున సాగర్ జలాలు రావడానికి ముందు జిల్లా స్వరూపమే వేరు. పంటపొలాలన్నీ వర్షాధార పంటలు మాత్రమే పండేవి. ఆనాడు జొన్న, సజ్జ, నువ్వులు, కొర్రలతో పాటు కంది వంటి ఆరుతడి పంటలను మాత్రమే పండించేవారు. రైతులు కేవలం ప్రృకృతి ఆధారంగానే పంటలను పండించేవారు. ప్రకృతి కరుణిస్తే పంటలు లేకుంటే కరువు కాట్యకాలు.. భూములన్నీ మరు భూములుగా వదిలిపెట్టాల్సి వచ్చేది. దీంతో రైతుల ఆర్థిక పరిస్థితి దైన్యంగా మారింది. పనుల్లేక వ్యవసాయాధారిత కూలీలు దూర ప్రాంతాలకు వలసలు వెళ్లాల్సి వచ్చేది. ఆనాడు ఇలాంటి అనాగరిక జీవనాన్ని గడిపిన దుస్థితి నెలకొని ఉంది. అలాంటి దైన్యపరిస్థితుల్లో జిల్లాలో ఉన్న రైతాంగానికి నాగార్జున సాగర్ జలాలు.. సరికొత్త ఊపిరి పోశాయి. అప్పటివరకు నీళ్లలేక సాగునీరు రాక.. పడావుపడిన భూములకు ప్రాణం పోసినట్లైంది. బంజరు భూములన్నీ బంగరు భూములుగా మారాయి.

● సాగర్ నీటితో జలసిరి

జిల్లాలో నాగ్యార్జున సాగర్ డ్యాం నుంచి ఖమ్మం జిల్లా వరకు (మున్నేరు వరకు) 180 కిలోమీటర్ల ప్రధాన ఎడమ కాలువ ఉంది. మున్నేరు అక్విడెక్టు నుంచి కృష్ణాజిల్లా నూజివీడు వరకు 117 కిలోమీటర్ల మేర ఈ కాలువను నిర్మించారు. 1967 నుంచి కాలువల నిర్మాణం కొనసాగినా.. 1980వరకు పూర్తి స్థాయిలో నిర్మితమయ్యాయి. జిల్లాకు 1983 నుంచి సాగర్ నీళ్లు విడుదలయ్యాయి. సాగర్ జలాల రాకతో జల్యాసిరి సంతరించుకుంది. జిల్లాలోని 17 మండలాల్లో 3లక్షల హెక్టార్ల సాగుభూమికి నీరందాయి. ఫలితంగా జిల్లాలో వ్యవసాయ రంగానికి ఊతం వచ్చింది. నేలకొండపల్లి, కూసుమంచి, ముదిగొండ, ఖమ్మం రూరల్, ఖమ్మం అర్బన్, కొణిజర్ల, వైరా, ఏన్కూరు, తల్లాడ, కల్లూరు , పెనుబల్లి, వేంసూరు, ఎర్రుపాలెం, మధిర, బోనకల్, చింతకాని మండలాలకు సాగర్ జలాలతో సాగు భాగ్యం లభించింది. సుమారు 132 టీఎంసీల నీటిని ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, కృష్ణా, పశ్చిమ గ్యోదావరి జిల్లాలు వినియోగించేందుకు ఈ కాలువను డిజైన్ చేయగా.. జిల్లాలో సాగర్ ఆయకట్టు ప్రాంతంలోని భూములన్నీ సస్యశామలం అయ్యాయి. అప్పటి వరకు జొన్న, సజ్జలు వంటి పంటలకే అవకాశం ఉన్న చేలన్నీ వరి పంటకు అవకాశం లభించింది. జిల్లాలో వరిధాన్యం పండించే స్థాయికి ఎదగడంతో దానికి అనుగుణంగా అన్ని రంగాలు అభివృద్ధి చెందాయి. వరితో పాటు రైతులు క్రమేణా వాణిజ్య పంటలైన పత్తి, మిర్చి, చెరకు, అపరాలు, పొద్దుతిరుగుడు లాంటి పంటల సాగుపై దృష్టి సారించారు. ఆ పంటల సాగు రైతులకు మరింత మనోధైర్యాన్ని కల్పించాయి. దీంతో జిల్లాలో వ్యవసాయ రంగం మరింత బలపడింది.

● రెండు దశాబ్దాల కాలంలో ఆరుసార్లు..

రెండు దశాబ్దాల కాలాన్ని పరిశీలిస్తే ఇప్పటివరకు ఆరు సార్లు కరువు వచ్చింది. 2002, 2003, 2004, 2012, 2014, 2015 సంవత్సరాల్లో నాగార్జున సాగర్ పరిధిలో కరువు వచ్చింది. సాగునీరు విడుదల చేయలేని స్థితిలో కేవలం తాగునీటిని శ్రీశైలం నుంచి తీసుకుని విడుదల చేయాల్సి వచ్చింది. వరుసగా కరువు పరిస్థితులు అధికంగా వస్తుండడంతో.. రైతులు సాగునీటికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాల్సి వచ్చింది. 2005లో ఉచిత విద్యుత్ పథకం వచ్చిన తర్వాత రైతులు సాగర్ ఆయకట్టు కింద స్థిరీకరించినప్పటికీ.. తరచూ కరువు పరిస్థితులను ఎదుర్కోవాల్సి వచ్చింది. 2002, 2003, 2004, 2015 సంవత్సరాల్లో అత్యంత దారుణమైన కరువు పరిస్థితులు కనిపించాయి. 2016 నుంచి సాగర్ ఆయకట్టులో పంటల పరిస్థితి ఆశాజనకంగానే ఉంది. అయితే కృష్ణా, గోదావరి నదీ అనుసంధానంలో భాగంగా ఖమ్మం జిల్లాలో సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను నాగార్జున సాగర్ కాలువలకు అనుసంధానం చేసి రెండు నదీ జలాలను వినియోగించేలా చేసే ప్రక్రియలో జిల్లాకు చెందిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సఫలీకృతులయ్యారు. ఇటీవలే గోదావరి జలాలను నాగార్జున సాగర్ కాలువలో పారించి రైతులకు బహుళ ప్రయోజనాన్ని ఒనగూర్చారు. తాజా పరిస్థితుల్లో సాగర్ జలాశయానికి జలాలు చేరుకున్నాయి. నిండుకుండలా ఉన్న సాగర్ 26 క్రస్ట్‌గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. ఎన్నడూ లేని విధంగా సాగర్ జలాలను జిల్లాకు ఈసారి ఆగస్టు 1కి విడుదల చేశారు. దీంతో సాగర్ ఆయకట్టు రైతులు సాగు పనుల్లో బిజీ బీజీగా ఉన్నారు.

'విజయ డెయిరీ'దశ మారుతోంది..!

(5వ పేజీ తరువాయి)

విజయ డెయిరీ నిల్వ సామర్థ్యం 10వేల లీటర్లు వరకే ఉంటుంది. సీజన్‌లో 20వేల లీటర్ల వరకు పాల సేకరణకు అవకాశం ఉన్నప్పటికీ.. ఎక్కువ పాలు నిల్వ చేయడానికి అవకాశం ఉండడం లేదు. దీంతో పరోక్షంగా గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రైవేట్ డెయిరీలకు పాల ఉత్పత్తులు వెళ్లి.. అవి కాస్త దశల వారీగా బలోపేతం అయ్యాయి. గతంలో అనేక మంది వ్యవసాయశాఖ మంత్రులుగా పనిచేసినా కూడా విజయ డెయిరీ ఆధునికీకరణ అంశాన్ని పట్టించుకోలేదు. కొద్దిపాటి మార్పులు మాత్రమే చేస్తూ వచ్చారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 25వేల లీటర్ల సామర్థ్యం కలిగిన మిషన్లు ఏర్పాటు చేయాలని దశాబ్దాలుగా విజయ డెయిరీ అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికలు పంపుతూనే ఉన్నారు.

స్వయంగా సమస్యలు పరిశీలించిన మంత్రి తుమ్మల

రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు బాధ్యతలు స్వీకరించిన తర్వాత విజయ డెయిరీ అభివృద్ధిపై పలు సార్లు సమావేశాలు నిర్వహించారు. 53ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన డెయిరీని ఆధునికీకరించాలని అధికారులు సూచించారు. దీంతో మంత్రి తుమ్మల నాబార్డు నుంచి రూ.2.35 కోట్ల నిధులు మంజూరు చేయించారు. ఈ క్రమంలో ఈనెల 21న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజయ డెయిరీని క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. డెయిరీ ఆధునికీకరణకు కావాల్సిన యంత్రాలు, కొనుగోళ్లపై సమీక్ష జరిపారు. డెయిరీ చుట్టూ వ్యర్థాలు పడకుండా చూడాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్యను ఆదేశించారు. పాల శీతలీకరణకు నీరు సప్లయ్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ అనుదీప్‌కు సూచించారు. ప్రైవేట్ పాల డెయిరీలకు పోటీగా విజయ డెయిరీ నిర్వహణ చేపట్టాలని అధికారులను మంత్రి తుమ్మల ఆదేశించారు.

రూ.2.35కోట్ల నిధులతో చేపట్టబోయే పనులు ఇలా....

సత్తుపల్లిలోని బీఎంసీయూ సెంటర్‌కు రూ.11 లక్షల నిధులు మంజూరు చేయించారు. వాటితో ఇన్‌స్టాంట్ మిల్క్ చిల్లింగ్ సిస్టమ్ రూ.6 లక్షలు, డెయిరీ ఫ్లారర్ రూ.2 లక్షలు, కోల్డ్ స్టోరేజీ సిస్టమ్ రూ.2 లక్షలు, మైనర్ సివిల్ పనులకు రూ.1.5 లక్షల నిధులు కేటాయించారు. ఖమ్మం విజయ డెయిరీ కేంద్ర కార్యాలయంలో 25వేల లీటర్ల కెపాసిటీ గల ఆధునిక యంత్రాల కోసం రూ.1.46 కోట్లు, సివిల్ పనులకు రూ.45 లక్షలు, మార్కెటింగ్ కోసం రూ.15 లక్షలు, బోర్‌వెల్ కోసం రూ.2.5 లక్షలు, కూలింగ్ యంత్రాలకు రూ.15లక్షల నిధులను మంజూరు చేయించారు.

చెరువులో పడి

ముగ్గురి గల్లంతు

(5వ పేజీ తరువాయి)

కంభం నాగేశ్వరరావు, ఆయన సోదరుడు కంభం సత్యం మత్స్యకారులు. నాగేశ్వరరావు చెరువును లీజుకు తీసుకుని చేపల పెంపకాన్ని కొనసాగిస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం సోదరుడు సత్యంతో కలిసి తన బైక్‌పై చెరువు వద్దకు వెళ్లాడు. రాత్రి అయినప్పటికీ ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబీకులు నాగేశ్వరరావుకు ఫోన్ చేశారు. ఎలాంటి స్పందన లేకపోవడంతో కుటుంబ సభ్యులు చెరువు వద్దకు వెళ్లగా.. బైక్‌తో పాటు ఇద్దరి దుస్తులు, చెప్పులు చెరువు కట్టపై ఉండడాన్ని గుర్తించారు. దీంతో కుటుంబీకులు వెంటనే గ్రామస్థులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు నాటు పడవలతో గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి సమయం కావడంతో గాలింపు చర్యలకు ఆటంకం ఏర్పడడంతో నిలిపివేశారు. ఈ ఘటనపై పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. అసలు అన్నదమ్ములు చెరువులోకి దిగారా!? లేదా!? అన్న కోణంలోనూ ఆరా తీస్తున్నారు.

సమానత్వం కోసం పాటుపడిన వ్యక్తి లాల్‌సింగ్

» సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా

పాల్వంచ రూరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో మనుషులందరు సమానత్వంతో మెలగాలని, తనవంతుగా పాటుపడిన మహనీయుడు భూక్యా లాల్‌సింగ్ నాయక్ అని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా అన్నారు. ఆదివారం మండలంలోని పాండురంగాపురంలో భూక్యా లాల్‌సింగ్‌నాయక్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. డీసీఎంఎస్ మాజీచైర్మన్, సహకార సంఘం అధ్యక్షుడు కొత్వాల శ్రీనివాసరావు మాట్లాడుతూ నాటి సమాజంలో ఉన్నటువంటి బేధాభిప్రాయాలను రూపుమాపడం కోసం లాల్‌సింగ్ నాయక్ కృషి చేశారని అన్నారు. ఈ సందర్భంగా స్థానిక పాఠశాలల విద్యార్థులకు పెద్దబాలశిక్ష పుస్తకాలను ఉచితంగా కుటుంబసభ్యులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్‌సేన రాష్ట్ర అధ్యక్షుడు బాణోత్ హస్సేన్‌నాయక్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి నరాటి ప్రసాద్, రమేష్ రాథోడ్, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి రమేష్ నాయక్, మాజీ జడ్పీటీసీ యర్రంశెట్టి ముత్తయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొండం వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెం బస్టాండ్ అభివృద్ధికి నిధులు

(5వ పేజీ తరువాయి)

పొంగులేటి శ్రీనివాసరెడ్డికి పలుమార్లు ఎమ్మెల్యే కూనంనేని విన్నవించారు. హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డికి, రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ల దృష్టికి కొత్తగూడెం బస్టాండ్ సమస్యలను తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని కొత్తగూడెం బస్టాండ్ మరమ్మతు పనుల కోసం గతంలో సింగరేణి సంస్థకు నిధులు కేటాయించాలని, పాల్వంచ ఆర్టీసీ బస్టాండ్ మరమ్మతు పనులకు సహకరించాలని జెన్కో సంస్థకు నివేదికలను స్థానిక ఎమ్మెల్యే కూనంనేని ప్రతిపాదించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో కొత్తగూడెం, పాల్వంచ బస్టాండ్ మరమ్మతుల కోసం సీఎస్ఆర్ నిధులు రూ.28 కోట్లు విడుదల చేసేందుకు ఏర్పాట్లు పూర్తయినట్లు తెలుస్తుంది. ఇదే నిజమైతే కొత్తగూడెంలో బస్టాండ్ నూతన హంగులతో అందుబాటులోకి రానుంది. ఇప్పటి వరకు కొత్తగూడెం, పాల్వంచ బస్టాండ్ అభివృద్ధికి.. మరమ్మతులకు ఎటువంటి నిధుల మంజూరుకు సంబంధించి అధికారికంగా ఎటువంటి ఉత్తర్వులు అందలేదని కొత్తగూడెం ఆర్టీసీ డీఎం దేవేందర్ ఆదివారం 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

ఒక్క నీటి చుక్కను

వదులుకోబోం

(5వ పేజీ తరువాయి)

ఎత్తిపోతల పథకం నిర్మాణం వల్ల నాగార్జునసాగర్ నిండదన్నారు. నాగర్జునసాగర్ ఎడమ కాల్వ ద్వారా సాగునీరు పొందుతున్న ఖమ్మం జిల్లా రైతులు నష్టపోతారని తెలిపారు. ప్రతీరోజు 13టీఎంసీల నీటిని శ్రీశైలం ప్రాజెక్ట్ పై భాగం నుంచి రాయలసీమకు లిఫ్ట్ చేసేలా ఆంధ్రప్రదేశ్ కుట్ర చేస్తోందన్నారు. ఈ దోపిడీ ఇలాగే కొనసాగితే 30రోజుల్లో శ్రీశైలం ఖాళీ అవుతుందన్నారు. అంతకు ముందు ముదిగొండ జూనియర్ కళాశాలలో జరిగిన సమావేశంలో భట్టి మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యపై ప్రత్యేక దృష్టిసారించిందన్నారు. ఇప్పటికే కొన్ని కంపెనీలతో ఎన్‌వోయూ కుదుర్చుకున్నట్టు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు మరింత క్వాలిటీ ఎడ్యుకేషన్ అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అనంతరం రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు రూ.1.50లక్షల విలువ కలిగిన డిజిటల్ బోర్డును కళాశాలకు అందించగా.. దాన్ని భట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కుర్రా లక్ష్మీ, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సీపీ సునీల్‌దత్, నాయకులు పాల్గొన్నారు.

దర్జాగా కబ్జా!

రూ.కోటి విలువైన ప్రభుత్వ భూమి ఆక్రమణ

పట్టించుకోని రెవెన్యూ అధికారులు



అడ్డుకుంటున్న రెవెన్యూ అధికారులు (ఫైల్)

తిరుమలాయపాలెం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఎటువంటి ఆధారాలు లేకుండా విలువైన ప్రభుత్వ భూమిపై కన్ను వేశాడు. ప్రభుత్వ రికార్డుల్లో ఎలాంటి కేటాయింపులు లేకున్నా నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ భూమిని దర్జాగా అనుభవిస్తున్నాడు. ప్రభుత్వ ఉద్యోగి కుటుంబానికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎలాంటి ప్రభుత్వ పథకాలకు అర్హులుకారు. కానీ ప్రభుత్వం తమ కుటుంబానికి ఉపాధి కోసం సుమారు ఎకరం భూమి కేటాయించిందంటూ అధికారులకే పంగనామాలు పెడుతున్నారు. రూ.కోటి విలువైన ప్రభుత్వ భూమి కబ్జాపై ఆంధ్రజ్యోతి కథనం.

రెవెన్యూ అధికారుల అలసత్వం నిర్లక్ష్యం మూలంగా అత్యంత విలువ చేసే ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయి. తిరుమలాయపాలెం శరవేగంగా అభివృద్ధి చెందడంతోపాటు భూముల ధరలు కూడా అమాంతంగా పెరిగిపోయాయి. దీంతో ఖాళీస్థలాలు, ప్రభుత్వ స్థలాలపై కబ్జాదారుల కన్ను పడుతుంది. తిరుమలాయపాలెం గ్రామంలో 250 సర్వే నెంబరు భూమిలో ఇదే గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కొప్పుల అశోక్ ఎకరం పట్టాభూమి ఉంది. ఆ భూమిలో సామిల్ ఏర్పాటు చేశారు. సామిల్ వెనుకభాగంలో కొంత గ్రామకంఠం భూమి ఉంది. దీనిని సాదాబైనామాలో తన పేరుతో నమోదు చేసుకున్నారు. అంతటితో ఆగకుండా పక్కనే ఉన్న 254/అ లో సుమారు 10 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఆ భూమిపై అతని కన్నుపడింది. పదవిలో ఉండగా తన పేరుతో ప్రభుత్వ భూమి ఎకరం భూమిని తనపేరుపై నమోదు చేయించుకున్నాడు. అప్పటి డిప్యూటీ తహసీల్దార్ కృష్ణవేణి, వీఆర్వో గురుమూర్తి తప్పుడు పత్రాలు సృష్టించి కొప్పుల అశోక్ పేరుతో నమోదు చేశారు. ఈ విషయమై రెవెన్యూ అధికారులకు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. దీంతో అప్పటి తహసీల్దార్ కోటా రవికుమార్ అక్కడు వెళ్లి ప్రభుత్వ స్థలంలో ఎటువంటి పనులు చేయవద్దంటూ హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేశారు. ఈ బోర్డును తొలగించి దర్జాగా ప్రభుత్వ స్థలం ఆక్రమించి పంటలు సాగుచేస్తున్నాడు. వాస్తవంగా కొప్పుల అశోక్‌కు 2007లో రెవెన్యూ అధికారులు నాకు ప్రభుత్వ స్థలం కేటాయించారని చెబుతున్నప్పటికీ అతనికి 2010లో వివాహం జరిగింది. పెళ్లికాని వారికి ప్రభుత్వ స్థలం పొందడానికి అనర్హుడు. అలాగే ఆయన కుటుంబసభ్యులు కూడా ప్రభుత్వ ఉద్యోగులే. ప్రభుత్వ భూమి ఎవరు కేటాయించారని అటు రెవెన్యూ అధికారులు, గ్రామస్తులు అడుగుతుంటే పొంతనలేని సమాధానం చెబుతున్నాడు. తనవద్ద ఆ భూమమికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు ఉన్నాయని అధికారులను బుకాయిస్తున్నాడు. అతని వద్ద ఎటువంటి ఆధారాలు లేవు. అక్రమంగా ఆక్రమించిన ప్రభుత్వ భూమిపై రైతుబంధుతో పాటు ట్రాక్టర్ రుణసౌకర్యం, నర్సరీ కూడా సబ్సిడీపై పొందాడు. జిల్లా కలెక్టర్, రెవెన్యూ అధికారులు స్పందించి ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని కబ్జాదారుడి నుంచి స్వాధీనం చేసుకుని భూమిలేని నిరుపేదలకు కేటాయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమి

అక్రమంగా భూమి ఆక్రమించి మాపై దాడులు చేస్తున్నారు

బాధితుల వేడుకోలు



మాట్లాడుతున్న హైమావతి దంపతులు

తిరుమలాయపాలెం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): వారసత్వంగా సంక్రమించిన భూమిని అక్రమంగా ఆక్రమించుకుని మాపై కొందరు దాడులు చేస్తు న్నారు. తమరే న్యాయం చేయాలని అధికారులను వేడుకుంటే మమ్ములను బెదిరిస్తున్నారని మండలం లోని మేకలతండాకు చెందిన మాజీ సర్పంచ్ బోడా హైమావతి-రాందాస్ దంపతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం తిరుమలాయపాలెంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పాతర్లపాడు రెవెన్యూ పరిధిలో సర్వే నం: 439/3లో భూమి ఉండగా ఆ భూమిని గత 30ఏళ్లుగా తాము సాగు చేసుకుంటు న్నామని తెలిపారు. కానీ ఇదే భూమిపై మేకతండాకు చెందిన బోడ అచ్చా మా భూమిని అక్రమంగా ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారు. దీనిపై కోర్టులో కూడా పిటీషన్ దాఖలు చేశామని తెలిపారు. కోర్టు కూడా మాకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందన్నారు. తమకు న్యాయం చేయాలని రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేస్తే న్యాయం చేయకుండా తిరిగి మమ్ములనే బెదిరిస్తున్నారని, అలాగే మా కుమారుడిపై అచ్చా కుటుంబ సభ్యులతో పాటు పిండిప్రోలుకు చెందిన కొందరు వ్యక్తులు దాడిచేసి కొట్టారని వారు వివరించారు. ఈ సందర్భంగా తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

రామయ్య మూలవరులకు అభిషేకం, స్వర్ణ పుష్పార్చన



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి వారి ఆలయంలో ఆదివారం మూలవరులకు అర్జిత సేవలో భాగంగా ప్రత్యేక అభిషేకం, స్వర్ణ పుష్పార్చన నిర్వహించారు. అలాగే నిత్యకల్యాణంలో భాగంగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, వేద ఆశీర్వచనం, తలంబ్రాలను వైదిక సిబ్బంది నిర్వహించారు.

రెండో పోలీస్ డ్యూటీ మీట్‌లో మూడు మెడల్స్ సాధించిన ఎస్సై



మెడల్స్‌ను అందుకుంటున్న ఎస్సై

భద్రాచలం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : భద్రాచలం ఎస్సై స్వప్న వరంగల్ నగరంలోని మామునూరులో జరిగిన తెలంగాణ పోలీస్ రెండో డ్యూటీమీట్ 2025లో మూడు మెడల్స్ సాధించారు. సైంటిఫిక్ ఇన్వెస్టిగేషన్ (ఐవో ఫొటోగ్రఫీ), క్రిమినల్ లా రాతపరీక్ష విభాగం, ఫోరెన్సిక్ సైన్స్ విభాగంలో మెడల్స్ సాధించారు. వరంగల్ పోలీసు కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ చేతుల మీదుగా మెడల్స్‌ను ఎస్సై స్వప్న స్వీకరించారు. గతంలో జరిగిన పోలీస్ మీట్‌లో సైతం స్వప్న రెండు మెడల్స్‌ను సాధించడం విశేషం. ఈ సందర్భంగా ఎస్సై స్వప్నకు భద్రాచలం సీఐ నాగరాజు, ఎస్సైలు, పోలీసు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ఇజ్రాయెల్ దాడులు అమానవీయం

7న జరిగే పాలస్తీనా సంఘీభావ ర్యాలీకి సీపీఎం మద్దతు

కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం వెల్లడి

ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): పాలస్తీనాపై ఇజ్రాయిల్ యుద్ధోన్మాద దాడులు చేస్తుందని వెంటనే అపాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం ఆరోపించారు. పశ్చిమాసియాలో కొన్ని ఏళ్లుగా పాలస్తీనాపై ఇజ్రాయిల్ యుద్ధం చేస్తూ ప్రజల ప్రాణాలను బలితీసుకుంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఖమ్మం సుందరయ్య భవన్‌లో పార్టీ రాష్ట్ర కమిటీసభ్యుడు బండి రమేశ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచ దేశాలు ముక్తకంఠంతో ఇజ్రాయిల్ దాడులను ఖండిస్తున్నాయన్నారు. కనీస నియమాలు పాటించకుండా విచక్షణా రహితంగా యుద్ధం చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే 56వేల పాలస్తీనా ప్రజలు మరణించారన్నారు. పాలస్తీనా ప్రజలకు మద్దతుగా ఈనెల 7న ఖమ్మంలో నిర్వహించే సంఘీభావ ర్యాలీకి సీపీఎం పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని తెలిపారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు మాట్లాడుతూ ప్రజలకు కనీసం ఆహార సరఫరా కాకుండా చేస్తుందని ఆరోపించారు. అమెరికా అండదండలతోనే ఇజ్రాయిల్ యుద్ధం చేస్తుందని విమర్శించారు. ప్రజాస్వామ్యవాదులు ఇజ్రాయిల్ తీరును తీవ్రంగా ఖండించాలని పిలుపునిచ్చారు జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శవర్గ సభ్యులు వై.విక్రమ్, యర్రా శ్రీనివాసరావు, మాదినేని రమేశ్, జిల్లా కమిటీ సభ్యులు మెరుగు రమణ, పెన్నంటి రమ్య, దుగ్గి కృష్ణ, మెరుగు సత్యనారాయణ, మడుపల్లి గోపాల్‌రావు, సత్యనారాయణరెడ్డి, మండల కమిటీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రెండు బంగారు పతకాలు సాధించిన మణుగూరు క్రీడాకారుడు



మెడల్స్ సాధించిన క్రీడాకారుడు రవీందర్

మణుగూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా పీవీ కాలనీకి చెందిన జల్లా రవీందర్ ఆదివారం హైద్రాబాదల్ జింఖానా గ్రౌండ్‌లో జరిగిన లాంగ్ జంప్ విభాగంలో, 100 మీటర్ల పరుగు పందెంలో గెలుపొంది రెండు బంగారు పతకాలను సాధించాడు. అరవై ఏళ్ల వయస్సులో క్రీడారంగంలో రాణిస్తున్న రవీందర్‌ను స్థానిక క్రీడాకారులు, మిత్రులు అభినందించారు. రవీందర్ ఎన్నో అద్భుతాలు సృష్టించాడని భవిష్యత్‌లో రాష్ట్ర, జాతీయస్థాయిలో మరెన్నో అవార్డులు, రివార్డులు కైవసం చేసుకోవాలని వారు ఆకాంక్షించారు.

వచ్చే ఏడాది జరిగే ప్రపంచ తెలుగు మహాసభలను జయప్రదం చేయండి

ఖమ్మంఖానాపురం హవేలి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : 2026 జనవరి 3, 4, 5న ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరులో జరిగే 3వ ప్రపంచ తెలుగు మహాసభలను జయప్రదం చేయాలని మాస్ట్రో డాక్టర్ గజల్ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం నగరంలోని జెడ్పీ సమావేశ మందిరంలో ఆంధ్ర సారస్వత పరిషత్, వికాసవేదిక సాహిత్యసంస్థ ఉమ్మడి ఖమ్మం జిల్లా ఆధ్వర్యంలో కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సమ్మేళనానికి ముఖ్య అతిధిగా హాజరైన గజల్ శ్రీనివాస్ మాట్లాడారు. గుంటూరు జిల్లా అమరావతి నందమూరి తారక రామారావు ఆడిటోరియంలో జరిగే 3వ ప్రపంచ తెలుగు మహాసభలకు సుమారు 4 లక్షల మంది కవులు హాజరవుతారని అన్నారు. వివిధ దేశాల నుంచి అవధానులు, రాజకీయ నాయకులు, వివిధ సాహిత్యకారులు హాజరై తెలుగుభాష యొక్క గొప్పతనాన్ని వివరిస్తారని చెప్పారు. అనంతరం విజయ్‌కుమార్ దేశాని రచించిన 'మనిషత్వపు కొన అంచుల్లో', నామవరపు కాంతేశ్వరరావు రచించిన 'అంతర్జ్వాల' పుస్తకాలను ఆవిష్కరించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాల నుంచి హాజరైన సుమారు 40 మంది కవులు తమ కవితలను చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో కవులు మువ్వా శ్రీనివాస్, పురిమళ్ల సునంద, తోట.సుభాషిణి, నామా పురుషోత్తం తదితయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గజల్ శ్రీనివాస్

కాంగ్రెస్ నాయకుడి ఇంట్లో చోరీ

బంగారం, నగదు అపహరణ



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న క్లూస్‌టీం

మధిర రూరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మధిర పట్టణంలో నందిగామ బైపాస్ రోడ్డులో నివాసం ఉండే కాంగ్రెస్ పార్టీ నాయకుడు చెరుకూరి నాగార్జున్ ఇంట్లో శనివారం అర్థరాత్రి దొంగలు చొరబడి బంగారం, నగదు అపహరించారు. ఈ మేరకు బాధితులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మధిరలో నందిగామ బైపాస్ రోడ్డులో నివాసముంటున్న చెరుకూరి నాగార్జున్ కుటుంబసభ్యులు ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లారు. శనివారం అర్థరాత్రి తర్వాత దొంగలు ఇంటి తాళం పగలగొట్టి లోపలకు ప్రవేశించారు. ఇంట్లో ఉన్న 704 గ్రాముల బంగారు వస్తువులు, రూ.1.20 లక్షల నగదును అపహరించారు. ఆదివారం ఉదయం పనిచేసే పని మనిషి ఇంటి తాళలు పగలగొట్టి ఉండటం చూసి వెంటనే యజమానులకు సమాచారం ఇచ్చింది. అనంతరం ఇంట్లో దొంగతనం జరిగిందని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. క్లూస్‌టీం సభ్యులు కూడా తనిఖీలు చేశారు.

రైలుకింద పడి గుర్తుతెలియని వృద్ధురాలి మృతి

ఖమ్మంక్రైం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): రైలుకింద పడి గుర్తుతెలియని వృద్ధురాలి మృతిచెందిన సంఘటన ఆదివారం ఖమ్మం రైల్వేస్టేషన్‌లో పరిధిలో జరిగింది. జీఆర్‌పీ హెడ్‌కానిస్టేబుల్ సత్యనారాయణరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం వరంగల్ నుంచి విజయవాడ వైపు వెళుతున్న ఈస్ట్‌కోస్టు రైలులో ప్రయాణిస్తుంది. ఈనేపథ్యంలో ఖమ్మం రైల్వేస్టేషన్‌లో దిగి మల్లేమడుగు సమీపంలో రైలుకింద పడి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి వయస్సు 60 ఏళ్లు ఉంటుందని, ఎరుపురంగు, గుండ్రని ముఖం, నల్లజాకీట్, నలుపు, తెలుపు చీర ధరించినట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు అన్నం ఫౌండేషన్ ఛైర్మన్ అన్నం శ్రీనివాసరావుకు సమాచారం అందించడంతో మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఈమేరకు రైల్వే పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

మైనర్ బాలిక ఆత్మహత్య

బూర్గంపాడు, 3 ఆగస్టు (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని గౌతమిపురం కాలనీకి చెందిన ఓ మైనర్ బాలిక (12) ఆదివారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు తెలిపిన వివరాలప్రకారం మధ్యాహ్నం వరకు తోటి ఫ్రెండ్స్‌తో కలిసి ఆడుకున్న బాలిక, కాసేపటి తర్వాత ఇంటికి వెళ్లింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మోరంపల్లి బంజర గ్రామానికి చెందిన ఈ బాలిక తండ్రి గతేడాది ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు. నాటి నుంచి బూర్గంపాడు లోని అమ్మమ్మ వాళ్ల ఇంటి దగ్గర తల్లితో పాటు ఉంటోంది. ఈ బాలిక ఆత్మహత్యకు గల కారణాలు తెలియడం లేదు. గతేడాది తండ్రి మరణమే బాలిక ఆత్మహత్యకు దారితీసి ఉండొచ్చనే అనుమానాలు స్థానికుల నుంచి వ్యక్తమవుతున్నాయి. ఈఘటనపై సమాచారం ఉందని, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తామని ఎస్సై ప్రసాద్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఖమ్మం క్రైం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఎలుకల మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటనపై ఖమ్మం 1వ పట్టణ పోలీసుస్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైందని ఎస్సై కరుణాకర్ తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం నిజాంపేటలో నివసించే దాసరి. రాజశేఖర్ (32) పెయింటర్‌గా పని చేస్తున్నాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఏడాది క్రితం భార్య పుట్టింటికి వెళ్లడంతో రాజశేఖర్ మద్యానికి బానిసై ఈనెల 1వ తేదీన మద్యం మత్తులో ఎలుకల మందు తాగాడు. గమనించిన బంధువులు ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. ఆదివారం ఆయనకు పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. మృతుని తల్లి వెంకటమ్మ ఫిర్యాదుమేరకు కేసు విచారణ చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

ట్యాంక్‌బండ్‌పై యువకుడి హల్‌చల్

లకారం చెరువు కట్టపై గంజాయి ముఠా ఉందని ప్రచారం

ప్రజలు రాకుండా రహదారి మూత

ట్యాంక్‌బండ్ ప్రాంతంలో పనిచేయని సీసీ కెమెరాలు



బారికేడ్లు అడ్డుపెట్టడంతో నిలబడి చూస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు



పని చేయని సీసీ కెమెరాలు

ఖమ్మం కార్పొరేషన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): సెలవు రోజు కావడంతో కొద్దిసేపు సేద తీరుదామని లకారం ట్యాంక్‌బండ్‌కు వెళ్లిన ప్రజలకు భయాందోళనలు కలిగిస్తూ ఓ యువకుడు హల్‌చల్ చేశాడు. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం కావడంతో లకారం చెరువు చుట్టూ ప్రైయివేట్ పాఠశాలలు, కాలేజీలు, మెడికల్ కాలేజీలు ఉండటంతో హాస్టళ్లలో ఉంటున్న తమ పిల్లల్ని తీసుకొని కొంతమంది తల్లిదండ్రులు ఆదివారం లకారం ట్యాంక్‌బండ్‌కు వచ్చారు. వారు ఇళ్ల వద్ద నుంచి తెచ్చిన ఆహారంతో పాటు స్థానికంగా రెస్టారెంట్లు నుంచి పార్శిళ్లు తీసుకొచ్చి కొద్దిసేపు పిల్లలతో సంతోషంగా గడిపేందుకు మధ్యాహ్నం సమయంలో ట్యాంక్‌బండ్‌కు చేరుకున్నారు. అదే సమయంలో అక్కడ ఉన్న ఓ యువకుడు ట్యాంక్‌బండ్ లోపల గంజాయి తాగే ముఠా ఉందని వారు మీపై దాడి చేస్తారని హెచ్చరించాడు. లోపల గంజాయి ముఠా ఉందని మీరు లోపలికి వెళ్తే వారు మీపై దాడిచేసి బంగారం తీసుకుంటారని చెప్తూ అక్కడకు వచ్చిన వారిని భయాందోళనలకు గురిచేశాడు. ఈ మేరకు అతను ప్రజలను లోనికి వెళ్ళనీయకుండా రహదారికి అడ్డుగా బారికేడ్లు అడ్డుపెట్టాడు. కాగా ఇటీవల కాలంలో లకారం ట్యాంక్‌బండ్ సమీపంలో గంజాయి ముఠాలు తిరుగుతున్నారని ఎక్సైజ్ పోలీసుల విచారణలోను తెలింది. కానీ కొన్ని నెలలుగా ట్యాంక్‌బండ్‌పై సీసీ కెమెరాలు పని చేయటం లేదు. ట్యాంక్‌బండ్ పోలీసు అవుట్ పోస్టు నిర్వాహణపై విమర్శలు వెలువడుతున్నాయి. పోలీసు అధికారులు స్పందించి ట్యాంక్‌బండ్‌పై అవుట్ పోస్టు పర్యవేక్షణతో పాటు సీసీ కెమెరాల మరమ్మతులు చేయించి, లకారం ట్యాంక్ బండ్‌కు వచ్చే ప్రజలు భరోసా కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

గంజాయి స్వాధీనం ... ఇద్దరు వ్యక్తుల అరెస్టు

కొత్తగూడెం టూటౌన్‌లో కేసు నమోదు

చుంచుపల్లి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కొత్తగూడెం టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో సీఐ ప్రతాప్ ఆదేశాల మేరకు ఎస్సై బి.కిషోర్ నేతృత్వంలో ఆదివారం పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ క్రమంలో గరీబ్‌పేటకు వెళ్ళే దారిలో రోడ్డు పక్కన ఉన్న పొదల్లో అనుమానస్పదంగా తిరుగుతున్న ముగ్గురు యువకులను పోలీసులు గుర్తించారు. వారి చేతుల్లో ప్లాస్టిక్ కవర్ పట్టుకొని వెళ్తుండగా పోలీసులు వారిని ఆపేందుకు యత్నించగా వారు పరిగెత్తారు. ఇద్దరు యువకులను పోలీసులు పట్టుకోగా, ఒకరు పరారయ్యారు. వీరి వద్ద 300 గ్రాముల గంజాయి ఉండడాన్ని నిర్ధారించి స్వాధీనం చేసుకొని టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ గంజాయి విలువ రూ.15 వేలు ఉంటుందని తెలిపారు. పట్టుబడిన నిందితుల్లో గరీబ్‌పేటకు చెందిన ఉదయ్‌కిరణ్ అలియాస్ భూపతి ఉదయ్, రామవరం ప్రాంతానికి చెందిన నాగ అఖిల్ అలియాస్ మెంటు ఉన్నారు. ఈ ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇది మరుగుదొడ్డా.... బడ్డీ కొట్టా...

ఐకేపీ కార్యాలయంలో నిర్మాణం...

నివ్వెర పోతున్న డ్వాక్రా మహిళా సంఘాలు

కల్లూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) కల్లూరు డివిజన్ కేంద్రంలోని ఐకేపి కార్యాలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న మరుగుదొడ్డి రూపురేఖలు బడ్డీ కొట్టును తపించేలా పనులు జరుగుతున్నాయి. దీంతో ఈ మరుగుదొడ్డి రూపురేఖలను చూసి పలువురు డ్వాక్రా మహిళా సంఘాలు నివ్వెర పోతున్నాయి. వివరాలిలా ఉన్నాయి. ఈ ఐకేపి కార్యాలయం పరిధిలో 46 గ్రామ సమైక్యలు ఉండగా, అందులో 36 గ్రామ సమైక్యల నుంచి సగుటున రూ. వెయ్యేసి రూపాయిలు సమీకరించారు. ఇలా మొత్తం రూ. 36 వేలు మండల సమైక్య ఖాతాలో గత ఆరు నెలల క్రితం జమా చేశారు. ఆ తరువాత మరుగుదొడ్డి నిర్మించకుండ ఉండటంతో ఈ విషయమై గత పక్షం రోజుల క్రితం కల్లూరులో జరిగిన ప్రజావాణిలో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి సమక్షంలో సిపిఐ, ఏఐటియూసీ నాయకులు పేద మహిళల నుంచి మరుగుదొడ్డి నిర్మాణం కోసం డబ్బులు వసూలు చేశారే కాని నేటి వరకు ఏలాంటి చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. ఈ విషయమై స్పందించిన ఎమ్మెల్యే రాగమయి పేద మహిళల నుంచి డబ్బులు వసూలు చేయవద్దని ప్రభుత్వం తరుపున తామే మరుగుదొడ్డి నిర్మిస్తామని చెప్పారు. అందుకు భిన్నంగా ఇటీవల బదిలి అయిన ఏపీఎం బి రాంబాబు ఎమ్మెల్యే రాగమయి ఆదేశాలను కూడ ఖాతరు చేయకుండ నిభంధనలకు విరుద్దంగా బడ్డీ కొట్టు రూపంలో మరుగుదొడ్డి నిర్మించటం పట్ల డ్వాక్రా మహిళా సంఘాల సభ్యులు నివ్వెర పోతున్నారు. ఇలా మరుగుదొడ్డి నిర్మిస్తున్న విషయమై డ్వాక్రా మహిళా సంఘాలు, ఏఐటియూసీ నాయకులు ఎంపిడివో దృష్టికి తీసుకోరాగా దానిని నిలుపుదల చేశారు. ఇలా బడ్డీ కొట్టులాగా నిర్మిస్తున్న మరుగుదొడ్డిని చూసి మహిళా సంఘాలు నవ్వుల పాలవుతున్నారు. తమ నుంచి వసూలు చేసిన నగదును తిరిగి చెల్లించేలా సదరు ఏపిఎం రాంబాబుపై చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల డ్వాక్రా సంఘాల మహిళలు జిల్లా అధికారులను కోరుతున్నారు.



కల్లూరులోని స్త్రీ శక్తి కార్యాలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న మరుగుదొడ్డి

రాష్ట్ర సరిహద్దులో ఎక్సైజ్ అధికారుల తనిఖీలు



వాహనాలను తనిఖీ చేస్తున్న అబ్కారీ అధికారులు

అశ్వారావుపేట రూరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ, ఆంధ్రా సరిహద్దులోని అశ్వారావుపేట చెక్‌పోస్ట్ వద్ద ఆదివారం ఆబ్కారీ అధికారులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. ఆబ్కారీ సీఐ సాంబమూర్తి ఆధ్వర్యంలో సిబ్బంది తెలంగాణ రాష్ట్రంలోకి వస్తున్న వాహనాలను నిలిపి తనిఖీలు చేశారు. ఆంధ్రా వైపు నుంచి నిషేధిత మత్తు పదార్థాలు, నకిలీ మధ్యాన్ని నివారించే క్రమంలో భాగంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. తనిఖీల్లో ఆబ్కారీ అధికారులు పాల్గొన్నారు.

నలుగురి అరెస్టు

దొంగిలించిన బంగారాన్ని విక్రయించేందుకు యత్నం

92 గ్రాముల బంగారం స్వాధీనం



దొంగ సొత్తును విక్రయించేందుకు వెళుతున్న ముఠా సభ్యులను అరెస్టు చేసిన పోలీసులు

దమ్మపేట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : దొంగిలించిన బంగారాన్ని విక్రయించేందుకు ఏపీలోని జంగారెడ్డిగూడెంకు ఆటోలో వెళ్తున్న నలుగురు వ్యక్తులను దమ్మపేట పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మొద్దులగూడెం క్రాస్‌రోడ్డు వద్ద ఆదివారం పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా ఒక ఆటోలో నలుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారించారు. ఈ మేరకు వారు బాలరాజుగూడెం గ్రామానికి చెందిన కొమ్మన బోయిన సీతారాములు వారం క్రితం దొంగించిన బంగారాన్ని తాము సత్తుపల్లి నుంచి జంగారెడ్డిగూడెంలో విక్రయించేందుకు వెళ్తున్నట్లు తెలిపారు. దీంతో వారి నుంచి 92 గ్రాముల బంగారం, నాలుగు సెల్‌ఫోన్లు, ఆటోను స్వాధీనం చేసుకుని వారిని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు ప్రదాన నిందితుడు కొమ్మనబోయిన సీతారాములు పరారీలో ఉన్నట్లు ఎస్ఐ సాయికిషోర్‌రెడ్డి తెలిపారు.

కోడిపందేల శిబిరంపై పోలీసుల దాడి

ఆరుగురి అరెస్ట్, 6 ద్విచక్ర వాహనాలు, రూ.3650 నగదు స్వాధీనం

బూర్గంపాడు, 3 ఆగస్టు (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాళ్లగొమ్మూరులో కోడి పందేలు నిర్వహిస్తున్న శిబిరంపై బూర్గంపాడు పోలీసులు ఆదివారం దాడులు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు తాళ్లగొమ్మూరు గ్రామంలో కోడి పందేలు ఆడుతున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు నిర్వహించగా, కోడిపందేలు ఆడుతున్న 6 గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 6 ద్విచక్రవాహనాలు, రూ, 3650 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. మరో 5 గురు వ్యక్తులు పరారైనట్లు బూర్గంపాడు ఎస్ఐ ప్రసాద్ తెలిపారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టామని వివరాలు వెల్లడించారు.

ప్రైవేటు టీచర్లు, లెక్చరర్ల సేవలను ప్రభుత్వం గుర్తించాలి

ఖమ్మంఖానాపురంహవేలి,ఆగస్టు3(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు విద్యాసంస్థల్లో పనిచేస్తున్న టీచర్స్, లెక్చరర్స్ సేవలను ప్రభుత్వం గుర్తించాలని టీపీటీఎల్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కె.విజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం నగరంలోని నిర్మల్‌హృదయ్ పాఠశాలలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఎన్నోఏళ్లుగా విద్యారంగానికి సేవ చేస్తున్న ప్రైవేటు ఉపాధ్యాయులను, వారి సేవలను ప్రభుత్వం, ప్రైవేటు సంస్థలు గుర్తించ లేకపోవటం దారుణమన్నారు. అనంతరం కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా కన్వీనర్‌గా గుమ్మా ముత్తారావు, కోకన్వీనర్‌లుగా అనుమోలు రామారావు, మహ్మద్ ఫారుఖ్, కమిటీ సభ్యులుగా విజయ్, ఉపేందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నేటినుంచి జోనల్ కార్యాలయాల్లోనూ ప్రజావాణి

- కేఎంసీతో పాటుగా రెండు కార్యాలయాల్లో ఫిర్యాదుల స్వీకరణ
- ఆదేశాలిచ్చిన కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మంకార్పొరేషన్, ఆగస్టు3(ఆంధ్రజ్యోతి): ప్రజల ఫిర్యాదులు స్వీకరించేందుకు ఇక మీదట విలీన ప్రాంతాలతో పాటుగా నగరంలోని సుదూర డివిజన్ల ప్రజలు ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయానికి రావాల్సిన అవసరం లేదు. సోమవారం నుంచి ఖమ్మం నగర పాలక సంస్థతో పాటుగా నార్త్‌జోన్(బల్లేపల్లి), సౌత్‌జోన్(పాత మునిసిపల్) కార్యాలయాల్లోను ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా ప్రజల నుంచి అధికారులు నేరుగా ఫిర్యాదులు స్వీకరించనున్నారు. ప్రతీ ఫిర్యాదును ఖమ్మం నగర పాలక సంస్థలో వలే ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ఈ మేరకు రెండు జోనల్ కార్యాలయాలకు అధికారులను కేటాయించారు. ఆయా డివిజన్లకు సంబంధించిన వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, పారిశుధ్యం, టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్, రెవెన్యూ అధికారులు, సిబ్బందిని జోనల్ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచారు. ప్రతీ ఫిర్యాదుకు స్పష్టమైన పరిష్కారం, సమాధానం అందేలా కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు ఆదివారం రాత్రి ఖచ్చితమైన ఆదేశాలిచ్చారు. ఉదయం 10.30గంటలకే అన్ని విభాగాల అధికారులు, ఉద్యోగులు హాజరు కావాలని, ఆయా డివిజన్లలోని కార్పొరేటర్లకు తెలియజేశారు. జోనల్ కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమాలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు.



సౌత్ జోన్ కార్యాలయం

బల్లేపల్లి జోనల్ కార్యాలయంలో:
1వ డివిజన్ నుంచి పదో డివిజన్ వరకు ప్రజలు ఈ కార్యాలయంలో ఫిర్యాదులు అందజేయవచ్చు.

పాత మున్సిపల్ జోనల్ కార్యాలయంలో:
16, 18, 24, 25, 26, 37, 38, 39, 40, 42 డివిజన్ల ప్రజలు ఇక్కడ కేటాయించబడ్డాయి.

కేఎంసీ కార్యాలయంలో:
రెండు జోనల్ కార్యాలయాలల్లో లేని డివిజన్ల నుంచి ఫిర్యాదులు స్వీకరించనున్నారు.

పట్టణ లారీ యూనియన్ సెక్రటరీగా శ్రీనివాస్

ఖమ్మంమార్కెట్‌ఆగస్టు3 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం పట్టణ లారీయజమానుల సంక్షేమ సంఘం సెక్రటరీగా దగ్గు శ్రీనివాస్ ఎన్నికైయ్యారు. ఆదివారం నిర్వహించిన ఎన్నికల్లో ప్రధాన కార్యదర్శి పదవికి నలుగురు పోటీపడగా శ్రీనివాస్ విజయం సాధించారు. మరో ఉపాధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికల్లో తేజావత్ వీరన్న విజయం సాధించారు. గతంలో ఓ అధ్యక్షపదవితో పాటు ఉపాధ్యక్షుడు, ట్రెజరర్, 8మంది ఈసీ మెంబర్లు ఏకగ్రీవంగా ఎన్నికైన సంగతి తెలిసిందే. కాగా నూతన పాలకర్గం సోమవారం ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు ఎన్నిక అధికారి కొత్తా వెంకటేశ్వరరావు తెలిపారు.

కత్తితో మహిళకు బెదిరింపులు

ఖమ్మంక్రైం, ఆగస్టు3(ఆంధ్రజ్యోతి): మహిళను కత్తితో బెదిరించిన వ్యక్తిపై ఖానాపురంహవేలి పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం రాత్రి కేసునమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాఘవయ్యనగర్‌కు చెందిన బాలెగడ్డ జ్యోతి అను మహిళకు పగడాల శ్రీను అను వ్యక్తికి కొంతకాలంగా రాజకీయ వివాదం ఉంది. ఈ నేపథ్యంలో ఆదివారం శ్రీను ఆమెను చంపుతానని కత్తితో వెంటపడుతూ బెదిరించాడని ఖానాపురంహవేలి పోలీసులకు ఫిర్యాదు చేసింది.ఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు పోలీసులు తెలిపారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ

వైరా, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లపూడిలో ఉన్న అనాథ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు ఆదివారం మాజీ ఎమ్మెల్యే బాణోతు మదన్‌లాల్ సతీమణి మంజుల, ఆయన కుమార్తె మనీ షా లక్ష్మీ దుస్తులు పంపిణీ చేశారు. మదన్‌లాల్ మనుమరాలు గోహిత లక్ష్మీ జన్మదిన వేడుకలను వృద్ధాశ్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. భోజనాలు ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షు లు బాణాల వెంకటేశ్వరరావు, మద్దెల రవి, మునిసిపల్ మాజీ వైస్‌చైర్మన్ ముళ్లపాటి సీతరాములు, మాజీ ఎంపీపీ కట్టా కృష్ణార్జున్‌రావు, వైరా వర్తకసంఘం అధ్యక్షుడు వనమా విశ్వేశ్వరావు, కామినేని శ్రీనివాసరావు, మాదినేని సునీత, వజినేపల్లి చక్రవర్తి, అమరనేని వెంకటేశ్వర్లు, మిట్టపల్లి కిరణ్ పాల్గొన్నారు.

వివేకానంద బోధనలతో సన్మార్గం

రామకృష్ణ మఠం స్వామిజీ తత్వదానంద మహరాజ్



సత్తుపల్లి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): యువత సక్రమమార్గానికి స్వామివివేకానంద బోధనలు దోహదపడతాయని రామకృష్ణ మఠం (హైదరాబాద్) స్వామిజీ తత్వదానంద మహరాజ్ అన్నారు. స్థానిక జేవీఆర్ పార్క్ సమీపంలోని హ్యూమన్ ఎక్సలెన్స్ భవనం (వివేకానంద ప్రాంగణం)లో ఆదివారం నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. తాగి తందనాలు ఆడకుండా సమయాన్ని సత్కర్మలకు వినియోగించాలని, మంచి ఆలోచనలతో, సానుకూల భావాలు కలిగిన వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. సత్సంగం ద్వారా ఆత్మను ఉత్తేజ పరచడం, ఆనందం, సంతృప్తి, ప్రశాంతత లభిస్తుందన్నారు. ఇప్పటి సమాజంలో మనిషికి శీల సంపద ఎంతో అవసరమని, సత్సంగం వ్యక్తులలోని ఒంటరితనాన్ని పోగొడుతుందని, మంచి భావలు ఏర్పరచి ప్రశాంతతను కలిగిస్తుందని ఆయన అన్నారు. కార్యక్రమానికి ముందు భగవంతుని మనన, స్మరణ, ధ్యానం, భజన కార్యక్రమాలు సాగాయి. ఈ కార్యక్రమంలో సూర్యప్రకాష్, పవన్, కేఎస్‌పీ.రాయ్, చీకటి శ్రీనివాసరావు, చల్లగుళ్ల శ్రీనివాస్, అప్పారావు, గట్టే వాసు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన సురేందర్

వైరా, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీ 9వ వార్డులో బీఆర్ఎస్‌కు చెందిన దోనేపూడి సురేందర్ తెలుగుదేశం పార్టీలో చేరారు. ఆదివారం వైరా టీడీపీ కార్యాలయంలో సురేందర్‌కు పార్టీ నియోజకవర్గ బాధ్యుడు చెరుకూరి చలపతిరావు, మండల, పట్టణ అధ్యక్షులు కిలారు సురేందర్, బొల్లేపల్లి శ్రీనివాసరావులు పార్టీ కండావా కప్పి సాదరంగా ఆహ్వానించారు. పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వైరా మాజీ వైస్ ఎంపీపీ కన్నుమూత

వైరా,ఆగస్టు3(ఆంధ్రజ్యోతి):మండలంలోని వల్లాపురం గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు, వైరా మండల ప్రజా పరిషత్ మాజీ వైస్‌చైర్మన్ వేల్పుల నర్సింహా(90) శనివారం రాత్రి ఖమ్మంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మృతిచెందారు. నాలుగురోజుల కిందట నర్సింహా ఇంటి వద్ద కాలుజారి కిందపడిపోవడంతో తలకు గాయమైంది. వెంటనే ఆయనను ఖమ్మంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చేర్పించి శస్త్రచికిత్స చేయించినప్పటికీ ఫలితం దక్కలేదు. చికిత్స పొందుతూ మృతిచెందారు. ఉమ్మడి పాలడుడు, వల్లాపురం గ్రామపంచాయతీ సర్పంచ్‌గా, అదే పంచాయతీలో ఉపసర్పంచ్‌గా పనిచేశారు. ఆతర్వాత 1995లో పాలడుగు ఎంపీటీసీగా గెలిచి వైస్‌ఎంపీపీగా బాధ్యతలు నిర్వహించారు. 2001లో వల్లాపురం సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. ఆయన కాంగ్రెస్ పార్టీలోనే ఈ పదవులు నిర్వహించారు. కొన్నేళ్ల కిందట భార్య అనారోగ్యంతో మృతిచెందింది. ఆయన చిన్న కోడలు వేల్పుల పావని బీఆర్ఎస్ నుంచి ఎన్నికై 2019నుంచి 2024వరకు వైరా ఎంపీపీగా పనిచేశారు. ముగ్గురు కుమారులు, నలుగురు కుమార్తెలున్నారు.

జమలాపురం ఆలయంలో వార్షిక పవిత్రోత్సవాలు ప్రారంభం



ఎర్రుపాలెం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన జమలాపురం శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం వార్షిక పవిత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. ప్రతి ఏటా శ్రావణమాసంలో నిర్వహించే ఆలయ పవిత్రోత్సవాలు ఆదివారం శ్రావణ శుద్ధ దశమి నుంచి మంగళవారం శ్రావణ శుద్ధ ద్వాదశి వరకు మూడురోజులపాటు శ్రీ అలివేలు మంగ, పద్మావతి అమ్మవార్లకు నూతన పట్టువస్త్రాలు అలంకరించి దర్శనం కలిపించారు. అనంతరం యాగశాల ప్రవేశం, గణపతిపూజ, పుణ్యాహవచనం, పంచగవ్యప్రాసన, ఋత్విక రణం, మండపారాధనలు, కలశస్థాపన నిర్వహించారు. ఏడాదికొకసారి ఆలయంలో పవిత్ర వాతావరణం పునఃస్థాపితం చేయడానికి ఉత్సవాలు జరుపుతారు. మూడురోజులుపాటు నిర్విరామంగా జరిగే పవిత్రోత్సవాలలో యాగశాల ప్రవేశం, దీక్షాధారణ, కలశస్థాపన, అదివాసములు నిర్వహిస్తారు. ఈ మూడురోజులలో ప్రత్యేకంగా చండీ, నవగ్రహ, సుదర్శన హోమాలు విశేషంగా నిర్వహిస్తున్నారు.

ధార్మిక విద్యతో మంచి పౌరులుగా ఎదుగుతారు

బోనకల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ధార్మిక విద్యను అభ్యసిస్తేనే మంచి పౌరులుగా ఎదగడం సాధ్యమవుతుందని ముస్లీం ఐక్య సంఘం సెంట్రల్ కమిటీ అధ్యక్షుడు మౌలానా ముజాహిద్ తెలిపారు. మండలంలోని గోవిందాపురం(ఎల్) గ్రామంలో ఆదివారం జరిగిన ధార్మిక సభలో ఆయన మాట్లాడుతూ.. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. ధార్మిక విద్య ద్వారా నైతిక విలువలు పెరుగుతాయని తెలిపారు. ముస్లీంలు ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడి ఉన్నారని, అన్ని విధాలుగా ఎదగాలని ముస్లీంలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ముస్లీం ఐక్య సంఘ నాయకులు షేక్ హుస్సేన్ సాహెబ్, షేక్ మహబూబ్ పాషా, గౌసుద్దీన్, చాంద్ సాహెబ్, షాజహాన్, రఫీ, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణాపురం రైల్వేగేట్‌పై బ్రిడ్జి మంజూరుకు కృషి

రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర

ఖమ్మంమార్కెట్, ఆగస్ట 3(ఆంధ్రజ్యోతి): రామకృష్ణాపురం రైల్వేగేట్‌పై బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేస్తానని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర హామీ ఇచ్చారు. ఖమ్మంలో వద్దిరాజు రవిచంద్ర నివాసంలో గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు కలిశారు. సమస్యపై వినతిపత్రం అందజేశారు. వెంటనే స్పందించి రైల్వే జీఎంకి ఫోన్ చేశారు.రామకృష్ణపురంలో రైల్వేగేట్ బ్రిడ్జి మంజూరు ఎందుకు కావడంలేదని ఆరా తీశారు. వెంటనే రైల్వే మంత్రికి సమస్యను వివరించేందుకు హామీ ఇచ్చారు. తప్పకుండా బ్రిడ్జి మంజూరుకు కృషి చేస్తానని వారితో తెలిపారు. వినతిపత్రం అందించిన వారిలో మాజీ సర్పంచ్ కన్నెబోయిన కుటుంబరావు, నాయకులు రవీందర్‌రెడ్డి, పిన్నెల్లి శ్రీనివాస్, గుండ్లపల్లి శేషు, శెట్టి సురేష్ ఉన్నారు.



పడేశారు.. వదిలేశారు!

- నిర్మాణాలు పూర్తైనా పునరుద్ధరణ కాని బస్‌షెల్టర్
- ఎండ, వానకు ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు

ఖమ్మంకార్పొరేషన్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి):డ్రెయినేజీ నిర్మాణంలో భాగంగా తొలగించిన బస్‌షెల్టర్‌ను... పనులు పూర్తి అయినా అధికారులు పునరుద్ధరించలేదు. గతంలో ఇల్లెందు క్రాస్ రోడ్డులోని ఐటీహబ్ ప్రాంతాల్లో రూ.10 లక్షలకు పైగా వ్యయం చేసి ఐదేళ్ల క్రితం కేఎంసీ అధికారులు గుడారం తరహాలో ఆధునిక బస్‌షెల్టర్‌లను నిర్మాణం చేశారు. ఖమ్మం నుంచి వైరా ద్వారా సుదూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులతో పాటుగా ఐటీహబ్ ఉద్యోగులు, విద్యార్థుల కోసం ఇది ఎంతగానో ఉపయోగపడేది. అయితే ఇటీవల కాలంలో ఇల్లెందు క్రాస్ రోడ్డు నుంచి కోర్టు వరకు డ్రెయినేజీ వెడల్పు, అండర్ డ్రెయినేజీ పనులు చేపట్టారు. బస్‌షెల్టర్‌ను తొలగించారు. కొద్దిరోజుల క్రితమే డ్రెయినేజీల నిర్మాణం పూర్తి జరిగింది. కానీ పడేసిన బస్‌షెల్టర్‌ను మాత్రం పునరుద్ధరణ చేయలేదు. దీంతో రహదారి పక్కన బస్‌సెల్టర్ పైపులు, పిల్లర్లు,పెద్దఎత్తున రహదారిని ఆక్రమించాయి. ఇవి ప్రమాదకరంగా మారాయి. నిత్యం ఇదే రహదారి నుంచి అధికారులు వెళ్తున్నారు కానీ.. తిరిగి ఏర్పాటు చేయటంపై సరైన ఆదేశాలు ఇవ్వలేదు.వర్షాలు పడిన సమయంలో ఇల్లెందు క్రాస్‌రోడ్డుకు సమీపంలో ఉన్న వారు ఇదే బస్టాండ్ రక్షణగా ఉంటుంది. ఇప్పటికైనా నగర పాలక సంస్థ కమిషనర్ స్పందించి పడేసిన బస్‌షెల్టర్‌ను తిరిగి పునరుద్ధరణ చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.





రాజకీయాలకు అతీతంగా ఆర్య వైశ్యుల గెలుపునకు కృషి చేయండి

పేదలను ఆర్థికంగా ఆదుకోవాలి

ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు సీతాచందర్‌రావు

నేలకొండపల్లి,ఆగస్టు3(ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక ఎన్నికల్లో ఆర్య వైశ్యులు ఏపార్టీ నుంచి పోటీ చేసినా, రాజకీయాలకు అతీతంగా వారి గెలుపునకు కృషి చేయాలని జిల్లా ఆర్య వైశ్య మహాసభ అధ్యక్షుడు పసుమర్తి సీతాచందర్‌రావు పిలుపునిచ్చారు. నేలకొండపల్లి వాసవీ భవన్‌లో ఆదివారం జరిగిన నియోజకవర్గస్థాయి ఆర్య వైశ్యుల సమావేశంలో సీతాచందర్‌రావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రంగా హనుమంతరావు అధ్యక్షతన జరిగిన సభలో సీతాచందర్‌రావు మాట్లాడుతూ ఆర్య వైశ్యులకు ఏ రాజకీయ పార్టీ టిక్కెట్ ఇచ్చినా, వారి విజయానికి పాటుపడాలని పిలుపునిచ్చారు. పేదలైన ఆర్య వైశ్యులను ఆదుకోవానికి ముందుకు రావాలని కోరారు. అర్హత ఉండి ప్రభుత్వ పథకాలు అందని వారికి మంత్రి శ్రీనివాసరెడ్డితో మాట్లాడి ప్రభుత్వ పథకాలు అందేలా చేస్తానని హామీ ఇచ్చారు. ఆర్య వైశ్యులు రాజకీయంగా ఐక్యంగా ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ నాగుబండి శ్రీనివాసరావు, చారుగుండ్ల నర్సింహమూర్తి, మాటూరి సుబ్రమణ్యం, దోసపాటి చంద్రశేఖర్, రేగూరి హనుమంతరావు, గెల్లా జగన్మోహన్‌రావు, వందనపు నాగేశ్వరరావు, కొత్తా రమేష్, బోనగిరి కిరణ్ కూసుమంచి, తిరుమలాయపాలెం మండల ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు వేముల శ్రీనివాస్, ఆమంచి దయాకర్‌లతో పాటుగా పెద్ద సంఖ్యలో ఆర్య వైశ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు సీతాచందర్‌రావు





ముత్యాలమ్మ ఆలయంలో మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

ఘనంగా శ్రావణ బోనాల వేడుకలు

ఖమ్మంఖానాపురంహవేలి, ఆగస్టు3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే శ్రావణ మాస బోనాల జాతర ఆదివారం జిల్లాలో ఘనంగా నిర్వహించారు.గంగమ్మ, పోచమ్మ, మైసమ్మ, ముత్యాలమ్మ, ఎల్లమ్మ, పెద్దమ్మ బోనాలతో పల్లె, పట్నం అనే తేడాలేకుండా ప్రతి చోటా బోనాలు సమర్పించారు. తెలంగాణాలో ఆషాడమాస బోనాలకు అధిక ప్రాదాన్యతను ఇస్తారు.కానీఖమ్మం జిల్లాలో ఆషాడ బోనాలు తక్కువగా నిర్వహించి శ్రావణమాసంలో బోనాలు అధికంగా నిర్వహిస్తారు. చర్చికాంపౌండ్ ముత్యాలమ్మఆలయం, వరదయ్య నగర్‌లోని మైసమ్మ తల్లి ఆలయం, రెడ్డిపల్లి మారెమ్మ తల్లి ఆలయంతోపాటు పలు అమ్మవార్ల ఆలయాలలో ఆదివారం అమ్మవార్లకు బోనాలు సమర్పించారు.చర్చికాంపౌండ్ ముత్యాలమ్మతల్లి ఆలయంలో జూబ్లీపుర, సారథీనగర్ గంగపుత్రుల సంఘం ఆధ్వర్యంలో బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కన్నం ప్రసన్న కృష్ణ, చేతి కృష్ణ, వెంకట్, నరసింహరావు పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం:మండలంలోని జల్లేపల్లి గ్రామంలో మహిళలు ముత్యాలమ్మ బోనం ఎత్తుకుని మొక్కులు చెల్లించారు. గ్రామాల్లో ప్రత్యేక సందడి నెలకొంది.

ఖమ్మంరూరల్: తల్లంపాడు, పెద్దతండా, తదితర గ్రామాల్లో ఆదివారం బోనాల వేడుకలు ఘనంగా నిర్వహించారు.





బోనాలతో భక్తులు, డప్పు వాయిద్యాలతో బోనాలను తీసుకొస్తున్న మహిళలు





పూజల్లో పాల్గొన్న భక్తులు

మాట నిలబెట్టుకోవాలి

ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు పగిడిపల్లి ప్రభాకర్

కామేపల్లి, ఆగస్టు3(ఆంధ్రజ్యోతి): వృద్ధులకు వికలాంగులకు ఇచ్చిన మాటను కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం నిలబెట్టుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు పగిడిపల్లి ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో వికలాంగులకు రూ.6వేలు, వృద్ధులు, వితంతువులకు రూ.4వేలు అందజేయాలన్నారు. 8న వైరాలో జరిగే సమావేశానికి మంద కృష్ణమాదిగ హాజరవుతున్నారని అన్నారు. ఈ సదస్సు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మండల ఇన్‌చార్జ్ చింతిరాల నాగభూషణం, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పాటిబండ్ల ప్రసాద్, వీహెచ్పఈఎస్ నాయకులు పెరుగు సైదులు, పాషా, బాగ్యమ్మ మంగ్య, వెంకటమ్మ మాదరు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రభాకర్

పురపాలక అభివృద్ధికి నిరంతర కృషి

- రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల

ఖమ్మంరూరల్, ఆగస్టు3(ఆంధ్రజ్యోతి): కొత్తగా ఏర్పడిన ఏదులాపురం పురపాలక అభివృద్ధికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు హామీ ఇచ్చారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల వెల్ఫేర్ అసోసియేషన్(ఈటీపీడబ్ల్యూఏ) ఆధ్వర్యంలో ఆదివారం టీసీవీరెడ్డి ఫంక్షన్ హాల్లో ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏదులాపురం మునిసిపాలిటీని అద్భుతంగా తయారు చేయటానికి రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రణాళిక తయారు చేశారన్నారు.మునిసిపాలిటీ పరిధిలో సుమారు 100 సీసీరోడ్ల నిర్మాణానికి అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారన్నారు. పెద్దతండా పరిధిలోని రాష్ట్ర గిడ్డంగుల భవనంలో ఉన్న బియ్యంనిల్వలతో సమీప కాలనీ వాసులు ముక్కపురుగుల కారణంగా బాధపడుతున్న విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. త్వరలో గోదాంను వేరే ప్రాంతానికి తరలిస్తామన్నారు. ఈ సమావేశానికి ఆర్టీఐ కమిషనర్ పీవీ శ్రీనివాస్, తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ సంఘం అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు, మునిసిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి, మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ బైరు హరినాథ్‌బాబు, జేఏసీ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గుంటపల్లి శ్రీనివాస్, కస్తాల సత్యనారాయణ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. కాలనీల సమస్యల పరిష్కారానికి ఉద్యోగులు సంఘంగా ఏర్పడటం రాష్ట్ర చరిత్రలోనే ఇది మొదటిది అవుతుందన్నారు. గ్రంథాలయం, రైతుబజార్, వాకింగ్ ట్రాక్ వంటి సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందని కమిషనర్‌ను కోరారు.ఈ సమావేశంలో ఈపీటీడబ్ల్యూఏ అధ్యక్ష, కార్యదర్శులు విజయ్, వై.శ్రీనివాసరావు, గౌరవ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, బి.శోభన్, కిషన్‌నాయక్, రాములు, గంధసిరి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న రాయల, ఆర్టీఐ కమిషనర్ శ్రీనివాస్

ఘనంగా స్నేహితుల దినోత్సవం



వేడుకలను నిర్వహిస్తున్న మహిళలు

బోనకల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాయి బాబా దేవాలయంలో ఆదివారం స్నేహితుల దినోత్సవ వేడుకలను నిర్వహించారు. సాయి భక్తబృందం కేక్ కట్ చేసి, స్వీట్లు పంచారు. ఒకరికొకరు ఫ్రెండ్‌షిప్ బ్యాడ్జిలను కట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో వేమా లలిత, కాటమరాజు, వెచ్చా శ్రీదేవి, సారిక, పద్మ, కస్తూరి, సీతా కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న గ్రామస్థులు

చింతకాని, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రామకృష్ణాపురం గ్రామంలోని రైల్వే గేటు (107) వద్ద ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని ఆదివారం గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్రను కలిసి వినతిపత్రం సమర్పించారు. రైల్వే గేట్ ద్వారా వాహనాల రాకపోకలు అధికంగా ఉంటాయని గేటు మూసివేసినప్పుడు వాహనదారులు గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోందన్నారు. పార్లమెంటు సమావేశాలలో తప్పకుండా ఈవిషయాన్ని కేంద్ర రైల్వే శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తానని ఆయన హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గుండ్లపల్లి శేషగిరిరావు, మాజీ సర్పంచ్ కన్నెబోయిన కుటుంబరావు, కురుగుంట్ల రవీందర్‌రెడ్డి, పిన్నెల్లి శ్రీనవాసరావు పాల్గొన్నారు.

బిల్లులు అందక..
ఏజెన్సీ కార్మికుల అవస్థలు

- అప్పులతో ఏజెన్సీలకు ఆర్థిక భారం
- పెండింగ్ బిల్లుల కోసం ఆందోళనకు సిద్ధమవుతున్న కార్మికులు



మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న ఏజెన్సీ కార్మికులు

కల్లూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఆరుగాలం శ్రమించి మధ్యాహ్న భోజనం తయారు చేసి అందిస్తున్న ఏజెన్సీ కార్మికులకు గత ఏడు నెలలుగా బిల్లులు, వేతనాలు అందక నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికే మండలంలోని పలు పాఠశాలల్లో పనిచేస్తున్న ఏజెన్సీ కార్మికులు పోయినేడాది నవంబరు నెల నుంచి ఈ ఏడాది విద్యా సంవత్సరం (పాఠశాలలు తెరచి) జూలై నెల వరకు గానూ 46 లక్షలు బకాయిలుగా ఉన్న బిల్లులు ప్రభుత్వం తరుపున అందాల్సి ఉంది. పాఠశాలల్లో పేద విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న మధ్యాహ్న భోజనం తయారిలో ఏజెన్సీ కార్మికులదే కీలక పాత్ర. నెలల తరబడి భోజనం తయారికి అందాల్సిన బిల్లులు అందక ఏజెన్సీ కార్మికులు ఆర్థికంగా నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో తమకు బకాయి బిల్లులు, వేతనాలు చెల్లించాలని వారు ఆందోళనకు సిద్ధమవుతున్నారు. మండల పరిధిలో మొత్తం 65 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా వాటి పరిధిలో 155 ఏజెన్సీలు పనిచేస్తున్నాయి. తాము ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం పేద విద్యార్థులకు మెను ప్రకారం భోజనం తయారీలో కోడిగుడ్లు, పప్పు, కూరలు, కిచిడీ, బగార, నూనె, కట్టెపుల్లలు, తదితర కిరాణా సరుకుల కోసం దుకాణాల్లో, అప్పులు చేయాల్సి వస్తుందని పలు పాఠశాలల ఏజెన్సీ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే కిరాణా షాపుల్లో అప్పుగా చేసిన సరుకుల కోసం నగదు లేక తాము బంగారు వస్తువులను కూడా తాకట్టు పెట్టి మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్నామని ఏజెన్సీ కార్మికులు చెప్తున్నారు. అసలే చాలిచాలని వేతనాలు, మెను చార్జీలు, ఆ పై బిల్లులు వేతనాలు మూడు నెలలు, ఆరు నెలలకు ఒక సారి ప్రభుత్వం ఏజెన్సీ ఖాతాల్లో జమ చేయడంతో తాము ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్లు వారు వివరించారు. మరో వైపున తమకు ప్రభుత్వం తరుపున బిల్లులు, వేతనాలు అందకపోయిన పాఠశాలల్లో ప్రభుత్వం నిర్దేశించిన మెను పాటించాల్సిందేనని ఉపాధ్యాయులు ఏజెన్సీలపై ఒత్తిడి చేయడంతో తాము అప్పులు చేసి విద్యార్థులకు భోజనం అందించాల్సి వస్తుందని కార్మికులు చెప్తున్నారు. విద్యార్థులకు సరైన పౌష్టికాహారం అందించాలంటే అందుకు తగ్గ నిధులు ఎప్పటికప్పుడు ప్రభుత్వం విడుదల చేస్తే తాము విద్యార్థులకు అన్నీ వేళల నాణ్యమైన భోజనం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు వారు తెలిపారు. ఇప్పటికైన రాష్ట్ర ప్రభుత్వం స్పందించి మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు బిల్లులు సకాలంలో చెల్లించి ఆదుకోవాలని కోరుతున్నారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ

వైరా, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లపూడిలో ఉన్న అనాథ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు ఆదివారం మాజీ ఎమ్మెల్యే బాణోతు మదన్‌లాల్ సతీమణి మంజుల, ఆయన కుమార్తె మనీషా లక్ష్మీ దుస్తులు పంపిణీ చేశారు. మదన్‌లాల్ మనుమరాలు గోహిత లక్ష్మీ జన్మదిన వేడుకలను వృద్ధాశ్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. భోజనాలు ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు బాణాల వెంకటేశ్వరరావు, మద్దెల రవి, మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ ముళ్లపాటి సీతారాములు, మాజీ ఎంపీపీ కట్టా కృష్ణార్జునరావు, వైరా వర్తకసంఘం అధ్యక్షుడు వనమా విశ్వేశ్వరరావు, కామినేని శ్రీనివాసరావు, మాదినేని సునీత, వజినేపల్లి చక్రవర్తి, అమరనేని వెంకటేశ్వర్లు, మిట్టపల్లి కిరణ్ పాల్గొన్నారు.



దుస్తులు అందజేస్తున్న దృశ్యం

టీడీపీలో చేరిన సురేందర్



టీడీపీలో చేరిన దోనేపూడి సురేందర్

వైరా, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీ 9వ వార్డులో బీఆర్ఎస్‌కు చెందిన దోనేపూడి సురేందర్ తెలుగుదేశం పార్టీలో చేరారు. ఆదివారం వైరా టీడీపీ కార్యాలయంలో సురేందర్‌కు పార్టీ నియోజక వర్గ బాధ్యుడు చెరుకూరి చలపతిరావు, మండల, పట్టణ అధ్యక్షులు కిలారు సురేందర్, బొల్లేపల్లి శ్రీనివాసరావులు పార్టీ కండావా కప్పి సాదరంగా ఆహ్వానించారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

నాణ్యమైన బొగ్గును స్థానికులకే ఇవ్వాలి

- కిష్టారంలో లారీ ఓనర్ల ఆందోళన



లారీ ఆఫీస్ వద్ద ఆందోళన చేస్తున్న అసోసియేషన్ బాధ్యులు

సత్తుపల్లి రూరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఓసీల నుంచి రవాణా చేసేందుకు నాణ్యమైన బొగ్గును ఇవ్వాలని లారీ, టిప్పర్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ బాధ్యులు సింగరేణి సంస్థను డిమాండ్ చేశారు. ఆదివారం కిష్టారం వై-జంక్షన్‌లోని లారీ ఆఫీస్ వద్ద తమ డిమాండ్లను పరిష్కరించాలంటూ.. ఆందోళన నిర్వహించారు. మొత్తం ఉత్పత్తిలో 30శాతం లోడింగ్ బొగ్గు స్థానిక అసోసియేషన్, పీహెచ్‌డీ లారీల ద్వారా జరగాలని, జేవీఆర్ ఓసీ, కిష్టారం ఓసీలలో జీ8, జీ13 పర్మిట్లు పెంచి లోడింగ్ ఇవ్వాలని, ఓసీలలో అన్నివేళల్లో బొగ్గు నిల్వలను 15రోజులకు సరిపడా ఉంచాలని, స్థానిక లారీలకు ఓసీలో లోడింగ్ లేనిరోజున స్థానిక లారీ యజమానులు ఆర్‌సీహెచ్‌పీ టిప్పర్లకు లోడింగ్ ఇవ్వవద్దని కోరారు. ఓసీలలో లభ్యమవుతున్న జీ8 గ్రేడ్ బొగ్గుకు ధర వ్యత్యాసం ఉందని, ఆ సరిచేసి జేవీఆర్ ఓసీలో కూడా స్థానిక లారీలకు లోడింగ్ ఇవ్వాలని, సత్తుపల్లి బొగ్గు గనులలో ఎక్కువగా బొగ్గు ఉత్పత్తి అవుతున్న క్రమంలో జీఎం కార్యాలయాన్ని త్వరగా ప్రారంభించాలని, స్థానిక లారీలకు లోడింగ్ పెంచేందుకు సింగరేణి సంస్థ ఈ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా బొగ్గు అమ్మకాలు జరపాలని, స్థానిక గనుల నుంచి డంపింగ్ టెండర్లు అన్నీ సింగరేణి సంస్థ నిర్ణయించిన ధరకే స్థానిక అసోసియేషన్ లారీలకు మాత్రమే ఇవ్వాలని, కోల్ హ్యాండ్లింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో కొండపల్లి రమేష్‌రెడ్డి, సూరిబాబు, దాసు, పీఎల్.ప్రసాద్, కోటి, శ్రీనివాసరావు, మునీర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

స్వామి వివేకానంద బోధనలతో సన్మార్గం

- హైదరాబాద్ రామకృష్ణ మఠం స్వామిజీ తత్పదానంద మహరాజ్



మాట్లాడుతున్న తత్పదానంద మహరాజ్

సత్తుపల్లి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): యువత సక్రమమార్గానికి స్వామివివేకానంద బోధనలు దోహదపడతాయని రామకృష్ణ మఠం (హైదరాబాద్) స్వామిజీ తత్పదానంద మహరాజ్ అన్నారు. స్థానిక జేవీఆర్ పార్క్ సమీపంలోని హ్యూమన్ ఎక్సలెన్స్ భవనం (వివేకానంద ప్రాంగణం)లో ఆదివారం నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. తాగి తందనాలు ఆడకుండా సమయాన్ని సత్కర్మలకు వినియోగించాలని, మంచి ఆలోచనలతో, సానుకూల భావాలు కలిగిన వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. సత్సంగం ద్వారా ఆత్మను ఉత్తేజ పరచడం, ఆనందం, సంతృప్తి, ప్రశాంతత లభిస్తుందన్నారు. ఇప్పటి సమాజంలో మనిషికి శీల సంపద ఎంతో అవసరమని, సత్సంగం వ్యక్తులలోని ఒంటరితనాన్ని పోగొడుతుందని, మంచి భావలు ఏర్పారచి ప్రశాంతతను కలిగిస్తుందని ఆయన అన్నారు. కార్యక్రమానికి ముందు భగవంతుని మనన, స్మరణ, ధ్యానం, భజన కార్యక్రమాలు సాగాయి. ఈ కార్యక్రమంలో సూర్యప్రకాష్, పవన్, కేఎస్‌పీ.రాయ్, చీకటి శ్రీనివాసరావు, చల్లగుళ్ల శ్రీనివాస్, అప్పారావు, గట్టే వాసు తదితరులు పాల్గొన్నారు.

వైరా మాజీ వైస్ ఎంపీపీ కన్నుమూత



నివాళులర్పిస్తున్న బొర్రా రాజశేఖర్

వైరా, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వల్లాపురం గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు, వైరా మండల ప్రజాపరిషత్ మాజీ వైస్‌చైర్మన్ వేల్పుల నర్సింహా(90) శనివారం రాత్రి ఖమ్మంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మృతి చెందారు. నాలుగురోజుల కిందట నర్సింహా ఇంటి వద్ద కాలుజారి కిందపడిపోవడంతో తలకు గాయమైంది. వెంటనే ఆయనను ఖమ్మంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చేర్పించి శస్త్రచికిత్స చేయించినప్పటికీ ఫలితం దక్కలేదు. చికిత్స పొందుతూ మృతిచెందారు. ఉమ్మడి పాలడుడు, వల్లాపురం గ్రామపంచాయతీ సర్పంచ్‌గా, అదే పంచాయతీలో ఉపసర్పంచ్‌గా పనిచేశారు. ఆతర్వాత 1995లో పాలడుగు ఎంపీటీసీగా గెలిచి వైస్‌ఎంపీపీగా బాధ్యతలు నిర్వహించారు. 2001లో వల్లాపురం సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. ఆయన కాంగ్రెస్ పార్టీలోనే ఈ పదవులు నిర్వహించారు. కొన్నేళ్ల కిందట భార్య అనారోగ్యంతో మృతిచెందింది. ఆయన చిన్న కోడలు వేల్పుల పావని బీఆర్ఎస్ నుంచి ఎన్నికై 2019నుంచి 2024వరకు వైరా ఎంపీపీగా పనిచేశారు. ముగ్గురు కుమారులు, నలుగురు కుమార్తెలున్నారు. ఆదివారం వల్లాపురంలో నర్సింహా భౌతిక కాయానికి రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, నాయకులు తుమ్మల సత్యం, మన్నే హన్మంతరావు, వేమూరి పుల్లారావు, వెంపటి వెంకటేశ్వరరావు, వైరా సొసైటీ వైస్‌చైర్మన్ కొణిదన కోటేశ్వరరావు, మాజీ సర్పంచ్ ఇటుకల మురళీ, తుమ్మల రాణాప్రతాప్ నివాళులర్పించారు.

జమలాపురం ఆలయంలో వార్షిక పవిత్రోత్సవాలు ప్రారంభం



ఆలయానికి పవిత్రమాలను సమర్పిస్తున్న భక్తులు

ఎర్రుపాలెం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన జమలాపురం శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం వార్షిక పవిత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. ప్రతి ఏటా శ్రావణమాసంలో నిర్వహించే ఆలయ పవిత్రోత్సవాలు ఆదివారం శ్రావణ శుద్ధ దశమి నుంచి మంగళవారం శ్రావణ శుద్ధ ద్వాదశి వరకు మూడురోజులపాటు శ్రీ అలివేలు మంగ, పద్మావతి అమ్మవార్లకు నూతన పట్టువస్త్రాలు అలంకరించి దర్శనం కలిపించారు. అనంతరం యాగశాల ప్రవేశం, గణపతిపూజ, పుణ్యాహవచనం, పంచగవ్యప్రాసన, ఋత్విక రణం, మండపారాధనలు, కలశస్థాపన నిర్వహించారు. హోమాలలో నిర్వహించే అగ్నిమథనం, హోమక్రతువుల నిర్వహించి, పవిత్రమాలలకు పుష్పాధివాసం, ధాన్యాధివాసం, శయ్యాదివాసం, మహానివేదన, నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఏడాదికొకసారి ఆలయంలో పవిత్ర వాతావరణం పునఃస్థాపితం చేయడానికి ఉత్సవాలు జరుపుతారు. ఆలయాల్లో ఏడాది పర్యంతం చేసే ఆరాధనలతో జరిగే దోషాలను నిత్య, నైమిత్తిక, కామ్య ఉత్సవాలైన నిత్య ఆరాధనహోమం, నివేదన, బలిసమర్పణలు, మాసోత్సవాలు, బ్రహ్మోత్సవాలు, సర్వాంగాభిషేకం, కలశస్థాపన, ఆరాధనాదులు, యజ్ఞయాగాదిక్రియలలో జరిగే మంత్ర, తంత్ర, క్రియరూప, శౌచ అశౌచ దోషనివారణ కోసం శ్రీవారికి పవిత్రోత్సవాలు నిర్వహిస్తారు. మూడురోజులుపాటు నిర్విరామంగా జరిగే పవిత్రోత్సవాలలో యాగశాల ప్రవేశం, దీక్షాధారణ, కలశస్థాపన, ఆదివాసములు నిర్వహిస్తారు. వివిధ రకాల హోమాలు, మండపారాధనలు, ఉపాలయాలతోపాటు అన్ని దేవాతమూర్తులకు పవిత్రములు ధారణ చేస్తారు.ఈ మూడురోజులలో ప్రత్యేకంగా చండీ, నవగ్రహ, సుదర్శన హోమాలు విశేషంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో కొత్తూరు జగన్మోహన్‌రావు, ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన అర్చకుడు శ్రీనివాసశర్మ, అర్చకులు , వేదపండితులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

తల్లాడ మండలంలో సండ్ర పర్యటన



గుమ్మా కేశవరావుకు నివాళులర్పిస్తున్న సండ్ర

తల్లాడ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలంలో ఆదివారం మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పర్యటించారు. మండలంలోని అన్నారుగూడెం, బాలపేట, గోపాలపేట గ్రామాలలో పర్యటించారు. బాలపేటలో ఇటీవల మృతిచెందిన పూర్ణకంటి రాములు కుటుంబాన్ని పరామర్శించారు. అన్నారుగూడెంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన బీఆర్ఎస్ మండల నాయకులు సుంకర రోశయ్యను పరామర్శించారు. ఇటీవల అనారోగ్యంతో మరణించిన గ్రామీణ వైద్యుడు గుమ్మా కేశవరావు, నున్నా సత్యవతి కుటుంబాలను పరామర్శించి వారి చిత్రపటాలకు పూలమాలలవేసి నివాళులర్పించారు. గోపాలపేటలో ఇటీవల మృతిచెందిన రిటైర్డ్ టీచర్ నున్నా జానకిరామయ్య కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దుగ్గిదేవర వెంకటలాల్, మాజీ సర్పంచ్ కోసూరి వెంకట నరసింహారావు సీనియర్ రాజకీయ నాయకులు కొమ్మినేని వెంకటేశ్వర్లు, పులి వెంకటనరసయ్య, దుగ్గినేనిసత్యానారాయణ, మారెళ్ల దేవేందర్, గోవిందు నరేష్, పులి నరసింహారావు గోస వీరయ్య, షేక్ హుస్సేన్ బేగ్, గుమ్మా నరేష్, గోపిశెట్టి నాగేశ్వరరావు, శనక్కాయల నరసింహారావు, చిట్టెం వీరయ్య, కందుల నారాయణ, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ధార్మిక విద్యతో మంచి పౌరులుగా ఎదుగుతారు



ధార్మిక సభలో మాట్లాడుతున్న మహబూబ్ పాషా

బోనకల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ధార్మిక విద్యను అభ్యసిస్తేనే మంచి పౌరులుగా ఎదగడం సాధ్యమవుతుందని ముస్లీం ఐక్య సంఘం సెంట్రల్ కమిటీ అధ్యక్షుడు మౌలానా ముజాహిద్ తెలిపారు. మండలంలోని గోవిందాపురం(ఎల్) గ్రామంలో ఆదివారం జరిగిన ధార్మిక సభలో ఆయన మాట్లాడుతూ.. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. ధార్మిక విద్య ద్వారా నైతిక విలువలు పెరుగుతాయని తెలిపారు. ముస్లీంలు ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడి ఉన్నారని, అన్ని విధాలుగా ఎదగాలని మూస్లీంలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ముస్లీం ఐక్య సంఘ నాయకులు షేక్ హుస్సేన్ సాహెబ్, షేక్ మహబూబ్ పాషా, గౌసుద్దీన్, చాంద్ సాహెబ్, షాజహాన్, రఫీ, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక కేంద్రంగా గార్లఒడ్డు

- ఆహ్లాదకర వాతావరణంలో దైవ క్షేత్రం

ఏన్కూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గార్లఒడ్డును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. వీటి పనులను త్వరగా ప్రారంభించడానికి ఐటీడీఏ అధికారులు ఇటీవల 70 ఏళ్ల క్రితం వెలసిన గార్లఒడ్డు శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం పరిసరాలను, కొండ ప్రాంతాలను దేవాలయ భూములను పరిశీలించారు. దీంతో ఏన్కూరు మండలం మరింత అభివృద్ధి చెందే అవాకాశం ఉంది. దేవాలయానికి వెనుక భాగంలో పచ్చని చెట్లతో అహ్లాదకరమైన వాతావరణంలో కొండ ఉంది. దీంతోపాటు దేవాలయానికి చుట్టూ 4 ఎకరాల భూమి ఉంది. జిల్లాలోనే ప్రముఖ పుణ్యక్షేత్రమైన దేవాలయానికి వేలాది మంది భక్తులు వస్తుంటారు. దేవాలయానికి వచ్చిన భక్తులు గుట్టపైకి కాలి నడకన వెళ్తుంటారు. నల్గొండ, వరంగల్ జిల్లాలతో పాటు ఏపీలోని కృష్ణా, గుంటూరు జిల్లాల నుంచి భక్తులు ఎక్కువగా వస్తుంటారు. శని, ఆదివారాల్లో దేవుని దర్శనానికి భక్తులు ఎక్కువగా వస్తుంటారు. పర్యాటక అభివృద్ధి ప్యాకేజీలో గుట్టపైకి వెళ్లడానికి భక్తులకు రహదారితో పాటు తాగునీరు, షెడ్లు, మరుగుదొడ్లు, మండపాలు, విశ్రాంతి గదులు నిర్మిస్తే భక్తులు సంఖ్య పెరిగి ప్రధాన పర్యాటక కేంద్రంగా విస్తరించే అవకాశం ఉంది.



ఆలయ ముఖద్వారం



శ్రీ లక్ష్మీనర్సింహాస్వామి దేవాలయం

నేడు విద్యుత్ సరఫరా బంద్

వైరా, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): వైరా సబ్‌స్టేషన్‌లో 11కేవీ లక్ష్మీపురం ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 9నుంచి 11గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదని ఏఈ సుందర్‌కుమార్ తెలిపారు. స్నానాల లక్ష్మీపురం, ముసలిమడుగు, కొండకొడిమ, ఖానాపురం పరిసర గ్రామాలకు కరెంట్ సరఫరా ఉండదని వినియోగదారులు తమకు సహకరించాలని సూచించారు.

పలు కుటుంబాలకు మువ్వా పరామర్శ

కల్లూరు, జూలై 3 (ఆంధ్రజ్యోతి): కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఆదివారం టిజిఐడిసి చైర్మన్ మువ్వా విజయబాబు పలు కుటుంబాలను పరామర్శించారు. ముందుగా ముచ్చవరం గ్రామంలో మాజీ సర్పంచ్ గంగవరపు వెంకటేశ్వరరావు(శ్రీను) తండ్రి సూర్యనారాయణ దశదిన కార్యక్రమంలో మువ్వా పాల్గొ ని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే కల్లూరులో ఏకలవ్య కాలనీలో సాయిగంగా కు మారుడు ఇటీవల మృతి చె ందగా కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. అదే విధంగా అనారోగ్యంతో బాధపడుతున్న బాలసాని వెంకటేశ్వరరావును పరామర్శించి మనోధైర్యం కల్పించి ఆర్థిక సహాయం అందించారు. కాంగ్రెస్ నాయకులు మట్టూరి జనార్ధన్, కిరణ్, ఉపేంద్ర, కృష్ణార్జునరావు, చంటి పాల్గొన్నారు.



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మువ్వా

ఆలయ అభివృద్ధికి దాతల సహకారం



కమిటీ సభ్యులకు కుక్కర్‌ను అందిస్తున్న దాతలు

సత్తుపల్లిరూరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఇటీవల నూతనంగా ప్రతిష్ఠించుకున్న ద్వారకాపూరి కాలనీలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు దోసపాటి మురళీకృష్ణ ప్రభు, సత్యనారాయణ, రఘు, శ్రీనివాసరావు, ఇమ్రాన్‌లు 25లీటర్ల సామర్థ్యం గల కుక్కర్‌ను ఆదివారం వితరణగా అందజేశారు. అదేవిధంగా శీలపురెడ్డి బాలకృష్ణారెడ్డి, శ్రీలక్ష్మీ దంపతులు రూ.11,116ఆర్థిక సహాయం అందజేశారని, ఆలయ అభివృద్ధికి భక్తులు, దాతల సహకారం ముఖ్యమని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

బత్తినేని ట్రస్ట్ ఆధ్వర్యంలో
ఉచిత వైద్య శిబిరం విజయవంతం



మందులను పంపిణీ చేస్తున్న వైద్య శిబిరం నిర్వాహకులు

బోనకల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): బోనకల్‌లో ఆదివారం బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. బీపీ, షుగర్, కంటి వ్యాధులకు సంబంధించి వైద్య పరీక్షలు చేసి అనంతరం రోగులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు పవన్ కుమార్ మాట్లాడుతూ.. శారీరక శ్రమ, వ్యాయామం లేకపోవడం వల్ల ఎక్కువగా బీపీ, షుగర్ బారీన పడుతున్నారని తెలిపారు. మితాహారం, సరైన జీవనశైలి వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చనని తెలిపారు. ప్రజలు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, గ్రామీణ వైద్యుల సంఘ జిల్లా అధ్యక్షుడు బొమ్మినేని కొండలరావు, ఆకేన పవన్, తోటపల్లి ఆనందరావు, మధు, మురళి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముత్యాలమ్మ తల్లి అమ్మవారి ప్రతిష్ఠ



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

సత్తుపల్లి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వెంగళరావునగర్‌లోని శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మ తల్లి అమ్మవారి ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం ఆదివారం కన్నులపండువగా సాగింది. ఈ సందర్భంగా కాలనీలో కుటుంబ సభ్యులు, బంధువుల రాకతో కళకళలాడగా పండుగ వాతావరణం నెలకొంది. తోరణబంధనం, కలశతీర్థం, గణపతిపూజ, పుణ్యాహవచనం, అమ్మవారి పరివారదేవత, క్షీరాధివాసం, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, ముత్తైదువులచే పూజా కార్యక్రమాలు సాగాయి. గణపతి, అమ్మవారి రుద్రహోమం, తీర్థప్రసాద వితరణ, సాయంత్రం అమ్మవారికి 1008బిందెల జలాదివాసం, నగరోత్సవం, అమ్మవారికి పవళింపు సేవ, ధాన్యాది శయ్యాది పుష్పాదివాసములు నిర్వహించారు. నేడు విగ్రహ ప్రతిష్ఠతో పాటు అన్నప్రసాద వితరణ చేయనున్నామని, భక్తులు హాజరవ్వాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.